

## పేదల కళ్లల్లో ఆనందమే ప్రజా ప్రభుత్వ విజయం

- నిజామాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన త్వరలోనే జిల్లాల్లో 'ఇందిరమ్మ టవర్లు': మంత్రి పొంగులేటి

8

వాస్తవాలు పలుకు
DD9 వార్త
తెలుగు దినపత్రిక
TE TL/26/A2635




హైదరాబాద్ | సంపుటి : 03 | సంచిక:101 | 23-08-2026 ఆదివారం | పేజీలు: 08 | వెల 3/-



# రేవంత్ అమెరికా పర్యటనపై రాజకీయ రచ్చ

- అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరణ
- ఓవర్సీస్ కాంగ్రెస్ కార్యక్రమాలే కారణమా?
- కేంద్రం తీరుపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం
- అధికారుల బృందాన్ని అమెరికాకు పంపే యోచన
- తెలంగాణ బీజేపీ, కాంగ్రెస్ మధ్య ముదురుతున్న వివాదం

2

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి చేపట్టిన 'తెలంగాణ రైజింగ్' విదేశీ పర్యటనలో అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడంతో రాజకీయ దుమారం రేగింది. లండన్ పర్యటనకు అనుమతి ఇచ్చిన కేంద్ర విదేశాంగ శాఖ.. బోస్టన్, న్యూయార్క్‌లో ఎంఐటీ, హార్వర్డ్ వంటి ప్రముఖ విద్యాసంస్థలతో సమావేశాలున్న అమెరికా షెడ్యూల్‌కు ఆమోదం ఇవ్వలేదు. ఈ పరిణామంపై తెలంగాణ కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తుండగా.. కేంద్ర నిర్ణయం రాజకీయంగా కొత్త చర్చకు దారితీసింది.



## కేంబ్రిడ్జ్‌తో తెలంగాణ భాగస్వామ్యానికి కసరత్తు

- హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాలకు ఆహ్వానం
- సంయుక్త పరిశోధనలపై చర్చ
- స్టార్టప్‌లు, యువ పారిశ్రామికవేత్తలకు సహకారం
- ప్రపంచస్థాయి విజ్ఞాన కేంద్రంగా హైదరాబాద్
- లివర్‌పూల్‌తోనూ వ్యూహాత్మక భాగస్వామ్యం

3

## లండన్‌లో అంబేద్కర్ హౌస్‌ను సందర్శించిన రేవంత్

- మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ముఖ్యమంత్రి పర్యటన
- అంబేద్కర్ జీవిత విశేషాలను వివరించిన యూకే ప్రతినిధులు
- సందర్శకుల డైరీలో సీఎం అనుభూతి
- హైదరాబాద్‌లో లండన్ యూనివర్సిటీ క్యాంపస్‌పై చర్చ

2





## భూ రీసర్వేను వేగవంతం చేయాలి

- పెండింగ్ దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి
- ప్రజలను ఇబ్బంది పెడితే సహించం
- రూ.230కే సిమెంట్ బ్యాగ్
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో విస్తృత పర్యటన

3



## సేతుబంధన్, ఆర్వోబీ పనుల్లో వేగం పెంచాలి

- నంది పహాడ్ బ్రిడ్జి పనులు వెంటనే ప్రారంభం కావాలి
- సెక్రటేరియట్ సోలార్ పార్కింగ్‌ను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలి
- ఆర్ అండ్ బి సమీక్షలో మంత్రి కోమటిరెడ్డి

3

## పవర్‌ఫుల్ తెలంగాణ కోసం పక్కా ప్రణాళికలు

- విద్యుత్ కొరత లేని రాష్ట్రమే లక్ష్యం
- విద్యుత్ డిమాండ్‌కు దీటుగా ప్రణాళికలు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, ఆగస్టు 22 :

రాష్ట్రాన్ని 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యానికి అనుగుణంగా విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టంగా ప్రకటించారు. రాష్ట్రంలో విద్యుత్, నీటి కొరత లేకుండా

మిగతా 2వ పేజీలో..





3

## సన్న వడ్లకు బోనస్‌లో కీలక మార్పులు

- ప్రభుత్వం నిర్దేశించిన 7 రకాలకే బోనస్

## షార్ట్ టర్మ్ కోర్సుల నిర్వహణ అవకాశాలు పరిశీలిస్తాం

లండన్‌లోని ప్రతిష్ఠాత్మక ఇంపీరియల్ కాలేజీ



2



## హేజో లేబొరేటరీస్ కెమికల్స్‌లో పేలుడు

- ఇద్దరు కార్మికుల మృతి
- క్షతగాత్రులు హైదరాబాద్‌కు తరలింపు



## ప్రజలను ఇబ్బంది పెట్టే అధికారం ఎక్కడిది?

- నిషేధిత జాబితా ఉప్పల్ బాధితులతో ఎమ్మెల్యే హరీష్ రావు

3



## పేదల ఆత్మగౌరవానికి అద్దంపట్టేలా ఇందిరమ్మ ఇళ్లు

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

7

నాగారంలో 93 ప్లాట్లతో పాటు మొత్తం 268 అర్హులైన పేద కుటుంబాలకు ఇళ్ల పత్రాలను పారదర్శకంగా పంపిణీ చేశారు.




# గచ్చిబౌలిలో ఘనంగా ప్రారంభమైన అంతర్జాతీయ తైక్వాండో పోటీలు

**హైదరాబాద్, ఆగష్టు22 (సిరి న్యూస్):**




అంతర్జాతీయ తైక్వాండో పోటీలు శనివారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులు పాటు జరగనున్న ఈ పోటీలకు హైదరాబాద్ ఆతిథ్య మిస్తోంది. ప్రపంచంలోని 15 దేశాల జట్లు పాల్గొంటున్న ఈ పోటీల్లో స్పీడ్ పంచింగ్, స్పీడ్ కిక్కింగ్, హై రేంజ్ వరల్డ్ రికార్డు, ఫ్రంట్ కిక్, జంపింగ్ త్రస్తు కిక్, ఇన్నర్ ఎడ్జ్ ఔటర్ ఎడ్జ్ కిక్ లకు సంబంధించి పోటీలు నిర్వహిస్తున్నారు. సమావేశం ప్రారంభించిన తైక్వాండో గ్రాండ్ మాస్టర్ జయంత్ రెడ్డి మాట్లాడుతు అంతర్జాతీయ తైక్వాండో పోటీలు హైదరాబాద్ లో నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. చిన్ననాటినుండే పిల్లలో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు తలిదండ్రులు కృషిచేయాలని అయన అక్కడికి వచ్చిన తలిదండ్రులను విజ్ఞప్తి చేశారు. ప్రతి మనిషి శారీరిక దారుఢ్యం కోసం కృషి చేయాల్సిన పరిస్థితి నెలకొన్న తరుణంలో క్రీడలను ప్రోత్సహించాలన్నారు. ఇటీవలే వరల్డ్ రికార్డు కోసం ఇక్కడే విద్యార్థులు కార్యక్రమం నిర్వహించామని అయన గుర్తు చేసారు. భారత దేశం నుండి ఎక్కువ మంది క్రీడాకారులను అంతర్జాతీయ వేదికలో నిలబడేలా చేయడమే తమ ఉద్దేశమని అయన అన్నారు. ఇప్పటి యువతకు ప్రోత్సహం కల్పించేలా పలువురు మాస్టర్లు కృషిచేయడం గర్వించదగ్గ విషయమన్నారు. ఇప్పటికే 32 పర్యాయాలు అంతర్జాతీయ స్థాయిలో రికార్డులు హైదరాబాద్ క్రీడాకారులు సాధించారని అందుకు తాను సారథ్యం వహించినందుకు గర్వ పడుతున్నానని అయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా పలువురు క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ గజేందర్ కుమార్ తో పాటు దేశ విదేశాల మాస్టర్ లు పాల్గొన్నారు.

**అలరించిన నృత్య ప్రదర్శన**

అంతర్జాతీయ థైక్వాండో పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమం కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన సభికులను ఆకట్టుకుంది. చిన్నారులు గడీల ఇష్థారెడ్డి, ఆరాధ్యలు చేసిన నృత్య ప్రదర్శన అటు నిర్వాకులను, ఇటు సభికులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆ చిన్నారులను నిర్వాకులు ప్రత్యేకంగా అభినందించారు.

# హేజో లేబొరేటరీస్ కెమికల్స్‌లో పేలుడు

**మొదటిపేజీ తరువాయి**

దోతిగూడెం శివారులోని హేజో లేబొరేటరీస్ కెమికల్ కంపెనీలో రియాక్టర్ భారీ శబ్దంతో పేలింది. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందగా మరో పదిమందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. కంపెనీలోని సిబ్లాక్‌లో నైట్ షిప్ట్‌లో 18 మంది కార్మికులు విధులలో ఉన్నారు. రియాక్టర్ వద్ద పనులు జరుగుతుండగా ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. క్షణాల్లో మంటలు వ్యాపించడంతో కార్మికులు భయంతో పరుగులు తీశారు. పేలుడు ధాటికి పెద్దవూర మండలానికి చెందిన చిన్న నాగిరెడ్డి, ఖమ్మం జిల్లాకు చెందిన నాగన్నబోయిన నరేష్‌కుమార్ మృతిచెందారు. రియాక్టర్ సమీపంలో పనిచేస్తున్న మరో పదిమంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. రియాక్టర్ పేలిన శబ్దం భారీగా వినిపించడంతో పరిసర గ్రామాల ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఏం జరిగిందో తెలియక కొందరు ఇళ్ల నుంచి బయటకు వచ్చి రోడ్లపైకి పరుగులు తీశారు. ప్రమాదం గురించి తెలుసుకున్న స్థానికులు పెద్ద సంఖ్యలో కంపెనీ వద్దకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే చౌటుప్పల్ రూరల్ సీఐ సతీష్‌రెడ్డి, ఎస్సై జగన్ పోలీసు సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకున్నారు. చౌటుప్పల్, హయత్‌నగర్ నుంచి ఫైర్ ఇంజిన్లు వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. హెజో లేబొరేటరీస్‌లో వరుసగా ప్రమాదాలు చోటుచేసుకోవడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత జూలై 16న రసాయన వాయువులు పీల్చడంతో అనంతపురం జిల్లా సింగనమల మండలం ఉలికల్లు గ్రామానికి చెందిన ఆలుమూరు కృష్ణారెడ్డి (42) అనే కార్మికుడు మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. ఆ ఘటన జరిగి నెల రోజులు కూడా పూర్తికాకముందే తాజాగా రియాక్టర్ పేలడంతో భద్రతా ప్రమాణాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రమాదం తర్వాత కంపెనీ పరిసరాల్లో దుర్వాసన వస్తోందని స్థానికులు చెబుతున్నారు. కంపెనీ ఆవరణలో మురుగునీరు చేరి ఉండటంతో పరిసర ప్రాంతాల్లో దుర్గంధం వ్యాపిస్తోందని ఆరోపిస్తున్నారు. ఈ దుర్వాసన కారణంగా కొందరికి తలతిరగడం, వాంతులు వంటి ఇబ్బందులు ఎదురైనట్లు చెబుతున్నారు. కంపెనీలో వరుస ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పర్యవేక్షణ చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రియాక్టర్ పేలుడు, గతంలో కార్మికుడి మృతి ఘటనల నేపథ్యంలో కంపెనీలో భద్రతా ప్రమాణాలను అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలించాలని కోరుతున్నారు.



# ఓటాయి సర్పంచ్ మృతి

- **అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రి సీతక్క**

**కొత్తగూడ, ఆగస్టు 22, సిరి న్యూస్ :**

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఓటాయి గ్రామ సర్పంచ్ గట్టి రాములు శుక్రవారం అర్ధరాత్రి గుండెపోటుతో మరణించారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆయన నివాసంలో సర్పంచ్ రాములు పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి అంత్యక్రియల్లో పాల్గొని సర్పంచ్ రాములు పాడె మోశారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నిత్యం ప్రజా సేవలో ముందుండి గ్రామ అభివృద్ధి కోసం కష్టపడే వ్యక్తి ఈ రోజు లేకపోవడం చాలా బాధాకరమని మంత్రి సీతక్క అన్నారు. మంత్రి సీతక్కతోపాటు స్థానిక ప్రజా ప్రతినిధులు, చైర్మన్లు, డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ నాయకులు సీనియర్ నాయకులు ఉన్నారు.

# రేవంత్ అమెరికా పర్యటనపై రాజకీయ రచ్చ

**హైదరాబాద్, ఆగస్టు 22, సిరి న్యూస్:**

**రాజకీయ కార్యక్రమాలే కారణమా?**

విదేశీ పర్యటనలకు అనుమతి ఇచ్చే సమయంలో ముఖ్యమంత్రి హోదాకు, పర్యటన ప్రధాన ఉద్దేశానికి అనుగుణంగా కార్యక్రమాలు ఉన్నాయా అనే అంశాన్ని పరిశీలిస్తామని విదేశాంగ శాఖ పేర్కొంది. అమెరికా షెడ్యూల్‌లో ఓవర్సీస్ కాంగ్రెస్ వేదికలపై కార్యక్రమాలు, పార్టీ సమావేశాలు ఉండటమే అనుమతి నిరాకరణకు కారణమై ఉండొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారిక పర్యటనలో పార్టీ కార్యక్రమాలకు చోటు కల్పించడంపై కేంద్రం అభ్యంతరం వ్యక్తం చేసినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**కేంద్రంపై కాంగ్రెస్ విమర్శలు**

కేంద్ర నిర్ణయాన్ని తెలంగాణ కాంగ్రెస్ నేతలు తీవ్రంగా తప్పుబడుతున్నారు. పెట్టుబడులు, అంతర్జాతీయ విద్యాసంస్థలను తెలంగాణకు తీసుకురావాలన్న ప్రయత్నాలను కేంద్రం అడ్డుకుంటోందని ఆరోపిస్తున్నారు. గతంలో ఇతర విపక్ష రాష్ట్రాల ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనలకు అనుమతుల విషయంలోనూ ఇలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయని గుర్తుచేస్తున్నారు.

**అమెరికా కార్యక్రమాలు కొనసాగింపు**

అమెరికా పర్యటనకు సీఎం వెళ్లకపోయినా.. ముందుగా ఖరారైన విద్యా, పరిశోధన సంబంధిత కార్యక్రమాలను అధికారులు కొనసాగించాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అమెరికాలోని విశ్వవిద్యాలయాలతో ప్రతిపాదిత అవగాహన ఒప్పందాలు, భాగస్వామ్యాలపై చర్చలు కొనసాగించాలని సూచించారు. దీంతో పర్యటన రద్దయినా తెలంగాణ రైజింగ్ లక్ష్యాలకు సంబంధించిన కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం కొనసాగనుంది.



**కాంగ్రెస్‌లోనూ అంతర్గత రాజకీయాలు**

రేవంత్‌రెడ్డి పర్యటన మధ్యలోనే హైదరాబాద్‌కు తిరిగి రావడం వెనుక రాష్ట్ర కాంగ్రెస్‌లోని అంతర్గత పరిణామాలు కూడా కారణమై ఉండొచ్చనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. ఎమ్మెల్యేల మధ్య విభేదాలు, మంత్రి కొండా సురేఖకు సంబంధించిన వివాదాలు, పార్టీలోని అసమ్మతి వర్గాల వ్యవహారాల నేపథ్యంలో సీఎం తిరిగి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి స్పష్టత లేదు.

# పవర్‌ఫుల్ తెలంగాణ కోసం పక్కా ప్రణాళికలు

**మొదటిపేజీ తరువాయి**

కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. హైదరాబాద్ నెక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజా వేదికగా ఎస్పీడీసీఎల్ నిర్వహిస్తున్న పవర్ ఎగ్జిబిషన్2026ను ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ విద్యుత్ శాఖ సాధిస్తున్న విజయాలు, తీసుకొస్తున్న సంస్కరణలు, ఆధునిక సాంకేతికతను ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా ఉన్న పరిశ్రమలు, పెట్టుబడిదారులు తెలంగాణలో మాన్యుఫ్యాక్చరింగ్, సర్వీస్ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. భవిష్యత్ విద్యుత్ అవసరాలను ముందుగానే అంచనా వేసి థర్మల్, సోలార్, హైడల్, పంప్‌డ్ స్టోరేజ్, బ్యాటరీ స్టోరేజ్ వంటి అన్ని మార్గాల్లో విద్యుత్ ఉత్పత్తి, సరఫరా సామర్థ్యాలను పెంచేందుకు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. బయటకు కనిపించకున్నా రాష్ట్ర అభివృద్ధికి విద్యుత్ ఉద్యోగులు అందిస్తున్న సేవలు ఎంతో కీలకమని ఆయన ప్రశంసించారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగినప్పటికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా చేయగలుగుతున్నామని చెప్పారు. గతంలో సుమారు 13 వేల మెగావాట్లుగా ఉన్న పీక్ డిమాండ్ ప్రస్తుతం 18 వేల మెగావాట్లకు పైగా చేరినా ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ పటిష్టం, ముందస్తు ప్రణాళికలు, అవసరమైన విద్యుత్‌ను సమయానుకూలంగా సమీకరించడం వల్ల సరఫరాలో అంతరాయం లేకుండా ప్రజలకు అందించగలిగామని ఉప ముఖ్యమంత్రి వివరించారు. 1912 టోల్‌ఫ్రీ సేవలు, 'పవర్ అంబులెన్స్' ద్వారా విద్యుత్ వినియోగదారుల సమస్యలను వేగంగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. 1912కు ఫోన్ చేసిన వెంటనే సమస్యను నమోదు చేసి పరిష్కరించే వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు. అవసరమైన పరికరాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, సిబ్బందితో సిద్ధంగా ఉండే పవర్ అంబులెన్సెస్ ద్వారా విద్యుత్ సమస్యలు తలెత్తిన ప్రాంతాలకు తక్షణమే చేరుకుని పరిష్కరించే విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్నామని వెల్లడించారు. సాంకేతికత వినియోగాన్ని పెంచుతూ ఇన్ హౌస్ సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేయడం అభినందనీయమని భట్టి కొనియాడారు. వినియోగదారుడి నంబర్ ఆధారంగా అతని లొకేషన్, విద్యుత్ సరఫరా ఎక్కడినుంచి జరుగుతోంది వంటి సమాచారాన్ని సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అందుబాటులోకి తీసుకురావడం విద్యుత్ సేవల్లో పారదర్శకత, సామర్థ్యాన్ని పెంచుతుందని తెలిపారు. 2047 నాటికి లక్ష్యాలను నిర్దేశించుకుని ఇప్పటినుంచే ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల ఏర్పాటుకు□ కనీసం నాలుగైదేళ్ల సమయం అవసరమవుతుందని, అందువల్ల భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ముందస్తు ప్రణాళికలు తప్పనిసరి అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. థర్మల్ విద్యుత్‌తో పాటు గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యత ఇస్తున్నామని, సోలార్, హైడల్, పంప్‌డ్ స్టోరేజ్, బ్యాటరీ స్టోరేజ్ సామర్థ్యాలను పెంచే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. విద్యుత్ రంగం వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగం సహా ప్రతి ఉత్పత్తి రంగానికి పునాది వంటిదని, రాష్ట్ర జీఎస్డీపీ వృద్ధికి నిరంతర విద్యుత్ సరఫరా అత్యంత కీలకమని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ రాష్ట్రంలో విద్యుత్ కొరతకు తావులేకుండా, పరిశ్రమల అవసరాలకు సరిపడ విద్యుత్‌ను అందించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని భట్టి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లను కల్పించడంతోపాటు ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వర్తించే ప్రతి ఉద్యోగికి రూ.కోటి ప్రమాద బీమా కల్పించినట్లు చెప్పారు. ఉద్యోగులు, వారి కుటుంబాల సంక్షేమం పట్ల ప్రభుత్వం పూర్తి బాధ్యతతో వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు. విద్యుత్ సంస్కరణలు, విజయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఉద్యోగులకు ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. శాఖకు చెందిన యాప్‌లు, ప్రజాబాట కార్యక్రమం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం, హైదరాబాద్‌లో చేపడుతున్న అండర్‌గ్రౌండ్ కేబుల్ వ్యవస్థ వంటి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి.పాటిల్, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, ట్రాన్స్ కో సీఎండీ కృష్ణ భాస్కర్, ఇతర డైరెక్టర్లు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.



# షార్ట్ టర్మ్ కోర్సుల నిర్వహణ అవకాశాలు పరిశీలిస్తాం

**హైదరాబాద్, ఆగస్టు 22, సిరి న్యూస్ :**

లండన్‌లోని ప్రతిష్ఠాత్మక ఇంపీరియల్ కాలేజీని రాష్ట్ర ప్రభుత్వ సీఎం సలహాదారు, ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సందర్శించారు. ఇంపీరియల్ కాలేజీ అధ్యక్షుడి చీఫ్ ఆఫ్ స్టాఫ్, స్ట్రాటజిక్ ఎంగేజ్‌మెంట్ విభాగం వైస్ ప్రెసిడెంట్ అమాండా వోల్తుయిజెన్, దక్షిణాసియా, ఆస్ట్రలేషియా ప్రాంతాల సీనియర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ మేనేజర్ రొసాన్నా గిల్లెస్పీతో ఆయన సమావేశమయ్యారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విశిష్టతను, విద్యా రంగంలో ఉన్న అవకాశాలను వారికి రామకృష్ణారావు వివరించారు. తెలంగాణతో కలిసి పని చేసేందుకు ఉన్న సహకార అవకాశాలపై కూడా చర్చించారు. తెలంగాణ, హైదరాబాద్‌లో షార్ట్ టర్మ్ కోర్సులు, ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు నిర్వహించే అవకాశాలను పరిశీలిస్తామని అమాండా తెలిపారు. పరిశోధన రంగంలో భాగస్వామ్యం, విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడి కార్యక్రమాలపై కూడా తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి ఉందని వెల్లడించారు. ఈ ఏడాది డిసెంబరు 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ఇంపీరియల్ కాలేజీ ప్రతినిధులను ఆయన ఆహ్వానించారు. సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మెడిసిన్ (స్టెమ్‌ఎస్టీఈఎం), బిజినెస్ విద్యా రంగాల్లో ఇంపీరియల్ కాలేజీ ప్రపంచంలోనే ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ఇలాంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థతో తెలంగాణ భాగస్వామ్య అవకాశాలపై చర్చలు జరగడం రాష్ట్రాన్ని అంతర్జాతీయ విద్యా కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాలకు మరింత ఊతమివ్వనుంది.

# బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ పోస్టర్ ఆవిష్కరణ

- **సెప్టెంబర్ 15లోపు ఎంట్రీలు పంపాలి**

**హైదరాబాద్, ఆగస్టు 22, సిరి న్యూస్ :**

బతుకమ్మ పండగ సందర్భంగా తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 'యంగ్ ఫిల్మ్ మేకర్ ఛాలెంజ్ 2026 సీజన్ 2□ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఎఫ్‌డీసీ ఎండీ జి.ముకుంద రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, ఎఫ్‌డీసీ ఈడీ కిషోర్ బాబులతో కలిసి శనివారం ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై, తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పండుగలు, కళారూపాలపై షార్ట్ ఫిలిం, పాటల పోటీలు ఉంటాయన్నారు. ఈసారి కొత్తగా జానపద గీతాలు, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ఇన్‌ఫ్లుయెన్సర్ల వీడియోస్, వ్యాసాలు (ఆర్టికల్స్)కు చోటు కల్పించారు. ఈ పోటీని యువ ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజ్ కొండా మాట్లాడుతూ ఈ పోటీలు యువతకు భవిష్యత్తులో సినీ రంగంలో అవకాశాలను సృష్టిస్తాయని, సృజనాత్మక కంటెంట్‌కు వేదికగా నిలుస్తాయని తెలిపారు. తెలంగాణ సంప్రదాయాలు, సంస్కృతి, పండగలు, ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు విస్తృతస్థాయిలో ప్రాచుర్యం పొందేందుకు దోహదం చేస్తాయన్నారు. లఘు చిత్రాల నిడివి 3 నిమిషాలు, పాటల రన్‌టైమ్ 5 నిమిషాలకు మించకూడదు. ఆయా వీడియోలు 4కే రిజల్యూషన్ కలిగి ఉండాలి. ఆసక్తి కలిగిన వారు వాటిని సెప్టెంబర్ 15లోపు youngfilmmakerschallenge@gmail.



com మెయిల్‌కు గానీ, 8125834009 వాట్సాప్ నంబరుకు గానీ పంపాలి. అనంతరం నిపుణులతో కూడిన జ్యూరీ విజేతలను ప్రకటిస్తుంది. ఈ పోటీలలో ప్రథమ బహుమతి రూ.3 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.2 లక్షలు, తృతీయ బహుమతి రూ.లక్ష. మరో ఐదుగురికి కన్సోలేషన్ బహుమతిగా రూ.20 వేల చొప్పున అందించనున్నారు. ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు ప్రదానం చేస్తారు.





# లండన్‌లో అంబేద్కర్ హౌస్‌ను సందర్శించిన రేవంత్

**లండన్, ఆగస్టు 22:**

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి లండన్‌లోని చారిత్రక అంబేద్కర్ హౌస్‌ను సందర్శించారు. 192122 కాలంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నివసించిన ఈ భవనాన్ని ప్రస్తుతం ఆయన జీవితాన్ని, ఆశయాలను ప్రతిబింబించే మ్యూజియంగా తీర్చిదిద్దారు. దాదాపు గంటపాటు సాగిన పర్యటనలో యాంటీ కాస్ట్ డిస్క్రిమినేషన్ అలయన్స్ చైర్ సంతోష్ దాస్.. యూకేలో అంబేద్కర్ జీవితానికి సంబంధించిన పలు విషయాలను ముఖ్యమంత్రికి వివరించారు.

**స్ఫూర్తినిచ్చిన అంబేద్కర్ హౌస్**

అంబేద్కర్ వ్యక్తిగత వస్తువులను పరిశీలించడం తన జీవితంలో గొప్ప అనుభూతుల్లో ఒకటని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సందర్శకుల డైరీలో తన అనుభూతిని నమోదు చేస్తూ.. అంబేద్కర్ హౌస్‌ను సందర్శించడం ఆధ్యాత్మిక క్షేత్రాన్ని దర్శించిన అనుభూతిని కలిగించిందని తెలిపారు. సామాజిక న్యాయం కోసం మరింత అంకితభావంతో పనిచేయాలన్న తన సంకల్పం బలపడిందని పేర్కొన్నారు.

**హైదరాబాద్‌లో లండన్ వర్సిటీ క్యాంపస్**

మరోవైపు హైదరాబాద్‌లో లండన్ యూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటుపై తెలంగాణ ప్రభుత్వం చర్చలు జరిపింది. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్, స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్ ప్రతినిధులతో తెలంగాణ బృందం సమావేశమైంది. హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటు చేసి వివిధ విభాగాల్లో విద్యా కోర్సులు నిర్వహించే అవకాశాలపై చర్చించారు.

# భూ రీసర్వేను వేగవంతం చేయాలి

**నిజామాబాద్, ఆగస్టు 22, సిరి న్యూస్:**

రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన భూ రీసర్వేను వేగవంతం చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏడాదిన్నర లోపు వ్యవసాయ భూములతోపాటు ఆబాదీ ఆస్తుల రీసర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. శనివారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నాగారంలోని నిర్మితి కేంద్రంలో ఇందిరమ్మ హౌసింగ్ టవర్స్ కోసం స్థలాన్ని పరిశీలించారు. అలాగే పాముల బస్తీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు. తర్వాత డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు ఇళ్ళ పట్టాలు అందజేశారు. అనంతరం కలెక్టరేట్‌లో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల రెవెన్యూ, హౌసింగ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే శాఖల అధికారులతో మంత్రి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రజలను అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులకు గురిచేస్తే ఎంతటివారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. పదేపదే సూచించినా పనితీరులో మార్పు రాని అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు, సాదాబైనామా అర్జీల పరిష్కారంలో జాప్యం చేస్తున్న తహసీల్దార్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలోని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం రీ సర్వే చేపడుతోందని తెలిపారు. ఏడాదిన్నరలోపు వ్యవసాయ భూములతోపాటు ఆబాది ఆస్తుల రీ సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే కొనసాగుతోందన్నారు. రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పేదల సొంతింటి కలను సాకారం చేసి వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించడమే ప్రజా ప్రభుత్వ సంకల్పమన్నారు. కుల, మత, రాజకీయాలకతీతంగా, పట్టణం, గ్రామం, గూడెం, తండా అనే తేడా లేకుండా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని స్పష్టం చేశారు. పట్టణాలు, నగరాల్లో ఇళ్ల స్థలాలు లేని నిరుపేదల కోసం హైదరాబాద్ తరహాలో రాష్ట్రంలోని ప్రముఖ పట్టణాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగానే నిజామాబాద్‌లో ప్రయోగాత్మకంగా టవర్స్ నిర్మించేందుకు స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నిర్మాణ వ్యయం తగ్గించేందుకు సిమెంట్ బ్యాగ్‌ను కేవలం రూ.230కే అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 43వ డివిజన్‌లోని పాముల బస్తీలో ఇందిరమ్మ పథకం కింద నిర్మాణం పూర్తయిన ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి బిల్లులు సకాలంలో అందుతున్నాయా, నిర్మాణంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం తమ సొంతింటి కలను సాకారం చేసిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు తెలిపారు. లబ్ధిదారుల సంతోషంలో భాగస్వామ్యం కావడం తనకు ఎంతో ఆనందంగా ఉందని మంత్రి పేర్కొంటూ గృహ ప్రవేశం చేసుకున్న కుటుంబాలకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన వస్త్రాలను బహూకరించారు. చివరి దశలో ఉన్న ఇళ్లను కూడా పరిశీలించి పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం ఐడీఓసీని ఆనుకుని నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంత్రి పరిశీలించారు. పెండింగ్ పనులను తక్షణమే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. నిధుల కొరత లేదని, పనులు పూర్తయిన 24 గంటల్లోనే బిల్లులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. డబుల్ బెడ్‌రూమ్ భవన సముదాయాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి హౌసింగ్ శాఖకు అప్పగించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్, తాగునీరు, పారిశుధ్య పనులను కూడా వెంటనే పూర్తి చేయాలని సూచించారు. స్థానిక రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి చెందిన 400 మంది లబ్ధిదారులకు మంత్రి పొంగులేటి చేతుల మీదుగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు పత్రాలను పంపిణీ చేశారు. మరో వారం, పది రోజుల్లో మరో 300 మంది లబ్ధిదారులకు ఇళ్లు అందిస్తామని మంత్రి వెల్లడించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులు పూర్తి పారదర్శకంగా, అర్హత ప్రాతిపదికన జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. మొదటి విడతలో 4.50 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు, హైదరాబాద్‌లో మరో లక్ష ఇళ్లను కలుపుకుని ఇప్పటివరకు మొత్తం 8 లక్షల ఇళ్లకు మంజూరు ఇచ్చామని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల సాకారం అయ్యే వరకు విడతల వారీగా ఇళ్లను మంజూరు చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కూడా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించే బాధ్యతను ప్రజా ప్రభుత్వం తీసుకుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, డాక్టర్ భూపతి రెడ్డి, నగర మేయర్ ఉమారాణి, హౌసింగ్ శాఖ ఎండీ గౌతమ్, కలెక్టర్ భవేష్ మిశ్రా, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, 'నుడా' చైర్మన్ కేశ వేణు తదితరులు పాల్గొన్నారు.

**నిజామాబాద్‌లోనూ ఇందిరమ్మ టవర్స్**

రాష్ట్రంలోని నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. హైదరాబాద్‌తో కలిపి రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, త్వరలో మరో రెండు విడతల్లో మరిన్ని ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రెవెన్యూ, హౌసింగ్, సర్వే, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించిన అనంతరం విలేకరుల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే పి. సుదర్శన్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు, శాసనమండలి సభ్యుడు మహేష్‌కుమార్ గౌడ్ కలిసి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు, నిజామాబాద్ ప్రజల కోరికకు అనుగుణంగా హైదరాబాద్ తరహాలో నిజామాబాద్‌లోనూ ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని మంత్రి ప్రకటించారు. ఇందుకోసం రెండు నుంచి మూడు ఎకరాల స్థలాన్ని గుర్తించి 1015 రోజుల్లో నోటిఫికేషన్ జారీ చేస్తామని తెలిపారు. నిజామాబాద్‌తోపాటు సమీప ప్రాంతాల్లోని అర్హులైన పేదలను గుర్తించి విడతల వారీగా ఇళ్లను మంజూరు చేస్తామని చెప్పారు. నిపుణులు, రైతుల సూచనల మేరకు తొలుత పది జిల్లాల్లోని 70 గ్రామాల్లో సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు. అదేవిధంగా నక్షాలు లేని 413 గ్రామాల్లోనూ సర్వే నిర్వహించామని, ప్రస్తుతం ప్రతి జిల్లాలో 70 గ్రామాల చొప్పున సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేస్తున్నామని వెల్లడించారు. సర్వే సందర్భంగా ప్రజల అభిప్రాయాలను కూడా సేకరిస్తున్నామని, వారి సూచనలను పరిగణనలోకి తీసుకుని తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికే అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, కమీషన్లు తీసుకునేవారు, దందాలు చేసేవారు, విషపూరిత ఆలోచనలతో వ్యవహరించేవారికి తాము ఎలాంటి సమాధానం ఇవ్వబోమని పొంగులేటి స్పష్టం చేశారు.

# సన్న వడ్లకు బోనస్‌లో కీలక మార్పులు

**హైదరాబాద్, ఆగస్ట్ 22, సిరి న్యూస్:**

ప్రభుత్వం సన్న వడ్లకు సంబంధించి క్వింటాకు రూ.500ల బోనస్ పథకంలో కీలక మార్పులు తీసుకొచ్చింది. అక్రమాలను అరికట్టి నిజమైన లబ్దిదారులకు మేలు చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వ్యవసాయ శాఖ ప్రకటించింది. కొత్తగా విధించిన నిబంధనలు క్షేత్రస్థాయిలో రైతులకు తీవ్ర అయోమయాన్ని, ఆందోళనను కలిగిస్తున్నాయి. ఈ బోనస్ సొమ్ము అందాలంటే ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్దేశించిన ఏడు రకాల సన్న వరి విత్తనాలను మాత్రమే సాగు చేసి ఉండాలి. అందులో ఆర్ఎస్ఆర్ 15048 (తెలంగాణ సోనా), కేఎన్ఎం 1638 (కూనారం వరి2), జైశ్రీరామ్, కేఎన్ఎం 7715, బీపీటీ 5204 (సాంబమసూరు), హెచ్ఎంటీ సోనా, డబ్ల్యూజీఎల్44 (సిద్ధి) రకాలు ఉన్నాయి. రైతులు తాము విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణాలకు వెళ్లి ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, కొనుగోలు బిల్లు సమర్పించి సెప్టెంబర్ 10లోగా తమ పేర్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని అధికారులు ఆదేశించారు. నెల రోజుల కిందటే విత్తనాలు కొనుగోలు చేసినందున ఇప్పుడు పాత బిల్లులు దొరకక, దుకాణాల చుట్టూ తిరగలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలాచోట్ల వ్యాపారుల వద్ద రికార్డులు లేకపోవడంతో వాగ్వాదాలు జరుగుతున్నాయి. మరోవైపు మార్కెట్లో లభించే ఇతర రకాల సన్న వరిని సాగు చేసిన రైతులు తమకు బోనస్ వర్తించకపోవడంపై నిరాశ వ్యక్తం చేస్తున్నారు. సొంతంగా విత్తనాలు ఉత్పత్తి చేసుకుని సాగు చేసిన రైతులు కూడా ఏ దుకాణంలో నమోదు చేసుకోవాలో తెలియక గందరగోళానికి గురయ్యారు. దీనిపై స్పందించిన జిల్లా వ్యవసాయాధికారి మోహన్ రెడ్డి స్పష్టతనిచ్చారు. సొంత విత్తనాలు వాడిన రైతులు దుకాణాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, స్థానిక వ్యవసాయ అధికారులకు సొంత డిక్లరేషన్ రాసి ఇస్తే సరిపోతుందని, సెప్టెంబర్ 10 లోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. కామారెడ్డి జిల్లాలోనే దాదాపు 2.51 లక్షల ఎకరాల్లో సన్న రకాలు సాగవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిబంధనలను మరింత సులభతరం చేయాలని రైతాంగం కోరుతోంది.




# రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం మోకాలడ్డు

**సిద్దిపేట, ఆగస్ట్ 22, సిరి న్యూస్ :**

తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందంటూ బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సీరియస్ అయ్యారు. రాష్ట్ర అభివృద్ధి కోసం విదేశీ పర్యటనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెళ్తే అనుమతి నిరాకరించడం కేంద్రం నిరంకుశత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. ఈ సందర్భంగా కేంద్రం తీరుపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. దీనిపై బీజేపీ రాష్ట్ర నాయకత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పల్లె పల్లెకు పొన్నం అన్న ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలో మంత్రి పొన్నం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెబుతున్న 'వికసిత్ భారత్ 2047' లక్ష్యం నెరవేరాలంటే ప్రతి రాష్ట్రం అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. ఈ మేరకు తెలంగాణకు న్యాయంగా రావాల్సిన ఆర్థిక సహకారం, నిధుల విషయంలో కేంద్రం సానుకూలంగా వ్యవహరించాలన్నారు. ఎన్డీయే ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల కోసం రాష్ట్ర బీజేపీ నాయకులు ఎందుకు గళమెత్తడం లేదని మంత్రి ప్రశ్నించారు. కేంద్రం పక్క రాష్ట్రాలకు నిధులు ఇస్తున్నప్పుడు తెలంగాణకు నిధులు ఎందుకు ఇవ్వడం లేదని వారిని సూటిగా ప్రశ్నించారు. రాజకీయాలకతీతంగా రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు మంత్రి తెలిపారు. అదే విధంగా కేంద్రం కూడా రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం 'పల్లె పల్లెకు పొన్నం అన్న పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో ప్రజలతో ముఖాముఖి సమావేశాలు నిర్వహించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మంత్రి పొన్నం వెల్లడించారు.

# ప్రజలను ఇబ్బంది పెట్టే అధికారం ఎక్కడిది?

**హైదరాబాద్, ఆగస్ట్ 22, సిరి న్యూస్ :**

నిషేధిత జాబితా పేరుతో ప్రజల భూములను కబ్జా చేసే హక్కు ఎవరు ఇచ్చారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ప్రశ్నించారు. ఇది 30శాతం కమీషన్ సర్కార్ అని ప్రజలే అంటున్నారని తెలిపారు. హైదరాబాద్ బోడుప్పల్ పరిధిలోని తిరుమల మెడోస్, లక్ష్మీ గణపతి కాలనీ, హేమానగర్ కాలనీలకు చెందిన వందలాదిమంది 22ఎ బాధితులు వచ్చి తమ ఆవేదన చెబుతుంటే గుండె కలిచివేసిందన్నారు. సర్వే నంబర్ 215, 215 పార్ట్‌లలో 30 ఏళ్లుగా ఎలాంటి వివాదాలు లేకుండా సుమారు 1,500 కుటుంబాలు నివసిస్తున్న ఇళ్లను రాత్రికి రాత్రే కాంగ్రెస్ ప్రభుత్వం అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద 22ఎ నిషేధిత జాబితాలో చేర్చడం అత్యంత దుర్మార్గమని హరీష్ రావు మండిపడ్డారు. కష్టాల్లో ఉన్నప్పుడు ఇల్లు అమ్ముకుందామని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్తే ఆస్తి ప్రొహిబిషన్‌లో ఉందన్న విషయం తెలియడంతో కాలనీ వాసులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని అన్నారు. చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ అయిన ఇళ్లను అడ్డుపెట్టుకుని ప్రజలపై ఒత్తిడి తెచ్చి 30 శాతం కమీషన్లు దండుకునేందుకే ఇలాంటి కృత్రిమ వివాదాలు సృష్టిస్తున్నారని రాష్ట్రవ్యాప్తంగా కోడై కూస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా ప్రశాంతంగా జీవిస్తున్న ప్రజలకు ఇప్పుడు 22A బూచి చూపిస్తూ బినామీలతో సెటిల్మెంట్లు చేసుకునే దందాకు తెరలేపారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. దీనికి సమాధానం ఏంటని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. బోడుప్పల్ కాలనీ వాసులు సహా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బాధితులందరూ అధైర్యపడవద్దు.. ఈ వసూళ్ల సర్కార్ మెడలు వంచైనా సరే ఆస్తులను కాపాడే బాధ్యతను బీఆర్ఎస్ పార్టీ తీసుకుంటుందని హరీష్ రావు స్పష్టం చేశారు. తక్షణమే ఆయా కాలనీలను 22A నిషేధిత జాబితా నుంచి తొలగించి బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# సేతుబంధన్, ఆర్వోబీ పనుల్లో వేగం పెంచాలి

**మొదటిపేజీ తరువాయి**

ఇంజనీర్లను ఆదేశించారు. సెక్రటేరియట్‌లో రోడ్లు భవనాలు శాఖపై శనివారం సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. రూ.26.81 కోట్ల అంచనా వ్యయంతో సెక్రటేరియట్‌లో ఏర్పాటు చేస్తున్న షెడెడ్ పార్కింగ్ (సోలార్ కార్ పార్కింగ్) పనుల పురోగతిపై మంత్రి ప్రత్యేకంగా ఆరా తీశారు. సెక్రటేరియట్‌కు ఉత్తర భాగంలో చేపట్టిన పనుల పురోగతిని మంత్రికి ఇంజినీర్లు వివరించారు. గత సమీక్షలో తీసుకున్న నిర్ణయం మేరకు సచివాలయ భవనం మూడు వైపులా (ఉత్తరం, పడమర, దక్షిణం) ఎలివేషన్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా బిల్డింగ్ స్ట్రక్చర్ వరకే సోలార్ పార్కింగ్ ఉండేలా చూడాలని మంత్రి ఆదేశించారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం సచివాలయ ఉత్తర భాగంలో రెండు వరుసల్లో, దక్షిణ భాగంలో మూడు వరుసల్లో, పడమర భాగంలో ఒక్క వరుసలో సోలార్ ప్యానెల్స్‌తో కూడిన కార్ పార్కింగ్ డిజైన్లు ఉండేలా చూడాలన్నారు. సంబంధిత డిజైన్లు అధికారులు మంత్రికి చూపారు. సోలార్ కార్ పార్కింగ్ అందుబాటులోకి వస్తే సెక్రటేరియట్‌పై 90వేల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, నెలవారీ విద్యుత్ బిల్లులో 16% ఆదా అవుతుందని మంత్రి పేర్కొన్నారు. సీఆర్ఐఎఫ్ రోడ్లు, సేతుబంధన్, ఆర్వోబీ పనుల్లో వేగం పెంచాలని, ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గాల వారీగా జరుగుతున్న వర్క్ ప్రోగ్రెస్ ఇంకా మెరుగవ్వాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఇప్పటివరకు 3,918 కి.మీ రోడ్లు, రూ.5159 కోట్లతో 316 పనులు మంజూరు చేశామని, అందులో కొన్ని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని, చాలావరకు పనులు చివరి దశలో ఉన్నాయని చెప్పారు. 202526కు సంబంధించి రూ.868 కోట్లతో చేపట్టిన 422.36 కి.మీ రోడ్ల పనుల పురోగతి సంతృప్తికరంగా ఉన్నదని అధికారులను మంత్రి ప్రశంసించారు. పలు హై లెవెల్ బ్రిడ్జిలు, రైల్వే ఓవర్ బ్రిడ్జిల పనులు నిర్ణీత సమయానికి పూర్తవ్వాలని సూచించారు. సేతుబంధన్ పథకం ద్వారా రూ.76 కోట్లతో చేపట్టిన నార్కట్‌పల్లి బ్రిడ్జి పనుల పురోగతిపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే సహకారంతో పనుల్లో మరింత వేగం పెంచాలన్నారు. మిర్యాలగూడ, నందిపహాడ్ బ్రిడ్జి పనులు వెంటనే ప్రారంభించాలని, దానికి సంబంధించిన సాంకేతిక అంశాలు తక్షణం పూర్తి చేయాలని, స్థానిక ఎమ్మెల్యేతో సమన్వయం చేసుకోవాలని మంత్రి సి.ఈ వనజను ఆదేశించారు. కరీంనగర్, మెదక్, నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, వికారాబాద్, నిజామాబాద్, సిద్దిపేట, మహబూబాబాద్, రంగారెడ్డి పనుల పురోగతిపై అధికారులు మంత్రికి వివరించారు. అధికారులు ఇంకా కష్టపడి పనిచేయాలని, మెరుగైన రోడ్లు నిర్మించాలనే ప్రభుత్వ లక్ష్యంలో అత్యంత కీలకంగా వ్యవహరించాలని మంత్రి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. సమీక్షలో ఈఎన్సీ (అడ్మిన్) లింగారెడ్డి, సీఈలు వసంత్ నాయక్, వనజ, ధర్మారెడ్డి, డీసీఈ అహ్మద్ అబ్దుల్ అలీ, ఈఈ రూప్‌కరణ్, డీఈ రూపారాణి, ఏఈఈ గంగాధర్, పలువురు ఆర్ అండ్ బి ఇంజనీర్లు పాల్గొన్నారు.



# ఆర్ఎఫ్‌సీఎల్ షట్‌డౌన్‌తో యూరియా కొరత

- **తక్షణం జోక్యం చేసుకోవాలన్న మంత్రి తుమ్మల**

**హైదరాబాద్, ఆగస్ట్ 22 , సిరి న్యూస్:**

రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్) షట్‌డౌన్‌పై తక్షణమే జోక్యం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు విజ్ఞప్తి చేశారు. దీని వల్ల సుమారు పది రోజులపాటు యూరియా ఉత్పత్తికి అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో యూరియా డిమాండ్ అధికంగా ఉన్న వేళ ఈ షట్‌డౌన్ ఆందోళనకరమని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాకు మంత్రి తుమ్మల లేఖ రాశారు. గత ఖరీఫ్ సీజన్‌లో 112 రోజుల పాటు ఆర్ఎఫ్‌సీఎల్‌లో యూరియా ఉత్పత్తి నిలిపివేశారని గుర్తు చేశారు. ఈ సంస్థ తరచూ షట్‌డౌన్ కారణంగా రాష్ట్రంలో యూరియా సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఫ్ఎఫ్ఎస్ ద్వారా రైతులకు యూరియా అందించడంలో ఆర్ఎఫ్‌సీఎల్ కీలకమని ఆ లేఖలో స్పష్టం చేశారు. ప్రస్తుతం షట్‌డౌన్‌ను త్వరగా ముగించి యూరియా ఉత్పత్తిని పునరుద్ధరించాలని కేంద్రాన్ని ఆయన కోరారు. ఆర్ఎఫ్‌సీఎల్ లోటును ఇతర దేశీయ ప్లాంట్లు, దిగుమతుల ద్వారా భర్తీ చేయాలని కేంద్రానికి విన్నవించారు. రైతులకు ఇబ్బంది లేకుండా ముందస్తుగా తగినంత యూరియా నిల్వలు ఏర్పాటు చేయాలని అధికారులకు మంత్రి తుమ్మల సూచించారు. శనివారం (నేటినుంచి)నుంచి ఎరువుల కర్మాగారాన్ని షట్‌డౌన్ చేసిన సంగతి తెలిసిందే.

# కేంబ్రిడ్జ్‌తో తెలంగాణ భాగస్వామ్యానికి కసరత్తు

**లండన్, ఆగస్టు 22, సిరి న్యూస్:**

హైదరాబాద్‌ను అంతర్జాతీయ విద్య, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంతో భాగస్వామ్యం కోసం తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం కేంబ్రిడ్జ్ విద్యావేత్తలతో సమావేశమై రాష్ట్రంలో విద్య, పరిశోధన రంగాల్లో సహకార అవకాశాలపై చర్చించింది. హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు సంయుక్త పరిశోధనలు, స్టార్టప్‌లకు సహకారం అందించే అంశాలపై కార్యాచరణ రూపొందించాలని ఇరు వర్గాలు నిర్ణయించాయి.



**పరిశోధన, విద్యపై దృష్టి**

సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు, ఎక్స్అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ పాల్గొన్నారు. ప్రపంచస్థాయి విద్యా సంస్థలకు హైదరాబాద్‌లో ఉన్న అవకాశాలను కేంబ్రిడ్జ్ ప్రతినిధులకు వివరించారు. కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్ ప్రొఫెసర్లు జైదీప్ ప్రభు, వెంకట సిరీష్ గండికోట తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి చూపారు.

**స్టార్టప్‌లకు చేయూత**

హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాలు చేపట్టడం, సంయుక్త పరిశోధనలు నిర్వహించడం, యువ పారిశ్రామికవేత్తలకు ఇంక్యుబేషన్ సదుపాయాలు కల్పించడం, స్టార్టప్‌ల అభివృద్ధికి సహకరించడం వంటి అంశాలపై భాగస్వామ్యానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని నిర్ణయించారు. కేంబ్రిడ్జ్‌తో భాగస్వామ్యం తెలంగాణ రైజింగ్ లక్ష్యాలకు మరింత బలం చేకూర్చనుంది.

**లివర్‌పూల్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం**

మరోవైపు లండన్‌లో రేవంత్‌రెడ్డిని లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్ ప్రతినిధులు సుసాన్ ఫిన్నెగాన్, నూలా గల్లాఘర్‌తో పాటు లివర్‌పూల్ ఫుట్‌బాల్ క్లబ్ ప్రతినిధులు కలిశారు. లైఫ్ సైన్సెస్, సాంకేతికత, క్రీడలు, సృజనాత్మక ఆర్థిక రంగాల్లో తెలంగాణతో భాగస్వామ్యానికి లివర్‌పూల్ ఆసక్తి వ్యక్తం చేసింది. భాగస్వామ్యాన్ని ఖరారు చేసేందుకు లివర్‌పూల్ ప్రతినిధి బృందం అక్టోబర్‌లో హైదరాబాద్‌ను సందర్శించనుంది.

# కాళేశ్వరంతో ఎలాంటి సమస్యలు లేవు

**సిరిసిల్ల, ఆగస్ట్ 22:**

తెలంగాణకు వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టులో బాగమైన అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టు నిర్మాణంలో ఎలాంటి సమస్యలు లేవని కేంద్ర జల విద్యుత్ పరిశోధన సంస్థ క్లీన్‌చిట్ ఇచ్చిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. అన్నారం, సుందిళ్ల ఎక్సలెంట్, గుడ్ అని రిపోర్ట్ ఇచ్చిందని రిపోర్ట్‌తో నైనా రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి కళ్లు తెరవాలని హితవు పలికారు. సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన డియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికైనా కాళేశ్వరం ప్రాజెక్టు వినియోగం లోకి తేవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఎల్‌నినోతో రాబోయే పంట కాలంలో సాగు నీటి కి ఇబ్బందులు వస్తాయని హెచ్చరిస్తున్నాయని అన్నారు. రెండు నెలల క్రితమే బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ కన్నెపల్లి పంపు హౌజ్ ను సందర్శించి, సాగు నీరు, తాగు నీటికి వచ్చే ఇబ్బందులు వస్తాయని ప్రభుత్వానికి సూచించారని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వినియోగం లోకి తెస్తే కేసీఆర్ కు పేరొస్తుందని ప్రభుత్వ భేషజాలకు పోతుందని విమర్శించారు. కన్నెపల్లి నుంచి వృథాగా దిగువన నీరు పోతున్నదని, చంద్రబాబు కోసం గురు దక్షణగా నీటిని రేవంత్ రెడ్డి అందజేస్తున్నారని విమర్శించారు.

# గిగ్ వర్కర్లకు ఉచిత హెల్త్ కార్డు

రూ.50 వేల విలువైన కార్డు ఉచితంగా అందజేత



**జనగామ, ఆగస్టు 22(డిడి 9 వార్త)బ్యూరో**

టాక్సీ, గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల ఆరోగ్య భద్రత కోసం రూ.50 వేల విలువైన వెల్నెస్ టాక్సీ అండ్ గిగ్ వర్కర్ హెల్త్ కార్డును ఉచితంగా అందిస్తున్నట్లు భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ (బీఆర్‌టీయూ) టాక్సీ, గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అత్తినమోని నాగేష్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ప్రారంభించగా.. తొలి కార్డును గాజులపాటి నరేష్ అందుకున్నారు. టాక్సీ, క్యాబ్, ఆటో డ్రైవర్లు, యాప్ ఆధారిత డ్రైవర్లు, డెలివరీ సిబ్బంది, ఇతర గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్లు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. హెల్త్ కార్డుతో ఉచిత డాక్టర్ ఓపీ, ఫాలోఅప్ కన్సల్టేషన్, 10 కిలోమీటర్ల వరకు ఉచిత అంబులెన్స్ సేవలు పొందవచ్చన్నారు. ల్యాబ్ పరీక్షలు, ఐపీ ఛార్జీలపై 20 శాతం, ఫార్మసీపై 10 శాతం రాయితీ లభిస్తుందని వివరించారు. రోజంతా రోడ్లపై పనిచేసే డ్రైవర్లు, గిగ్ వర్కర్లు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాగేష్‌కుమార్ సూచించారు. కార్మికుల సంక్షేమం, ఆరోగ్య భద్రత కోసం మరిన్ని కార్యక్రమాలను చేపడతామని తెలిపారు.

# 25న దివ్యాంగుల ఆటల పోటీలు

మండల విద్యాశాఖ అధికారి బెక్కంటి శ్రీనివాసరావు

**భద్రాచలం , ఆగస్టు 22 (డిడి9 వార్త)**



భద్రాచలం మండల పరిధిలోని 18 సంవత్సరాలలోపు దివ్యాంగ విద్యార్థులకు మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో ఆటలు పోటీలను నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి బెక్కంటి శ్రీనివాసరావు తెలిపారు. 5 నుండి 14 సంవత్సరాలు గల పిల్లలకు జిగ్ జాగ్ రన్నింగ్, మ్యూజికల్ చైర్, కప్ప గంతులు,,బాతు నడక , లెమన్ అండ్ స్పూన్ రేస్, 50 మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే 15 నుండి 18 సంవత్సరాల పిల్లలకు 100 మీటర్ల పరుగు పందెం, నిదాన నడకల్లో పందెం, కుర్చీల ఆట, షాట్ పుట్ త్రో, డిస్కస్ త్రో, లాంగ్ జంప్, హై జంప్, క్యారమ్స్ నిర్వహించి వారిలో విజేతకు ప్రథమ, ద్వితీయ బహుమతి ప్రధానము తోపాటు ప్రశంస పత్రం కూడా ఇవ్వబడును. ఈ కార్యక్రమానికి నిర్వాహకులుగా స్థానిక భవితా కేంద్రంలోని ఇంక్యుస్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ ఎస్ పద్మావతి, ఆర్ సుమలత వారు నిర్వహిస్తున్నట్టు బెక్కంటి తెలిపారు.

# అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యంపై అధికారుల దాడి

29.52 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం



**భద్రాచలం, ఆగస్టు 22 (డిడి9 వార్త)**

భద్రాచలంలో శనివారం 29.520 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను పౌర సరఫరాల శాఖ అధికారులు పట్టుకున్నారు. సారపాక గ్రామం నుంచి ఒడిశా రాష్ట్రంకు లారీలో తరలిస్తున్న పీడీఎస్ బియ్యంను పౌర సరఫరాల శాఖ డీటీ రాజేశ్వరరావుతో కూడిన బృందం పట్టుకున్నారు. అనంతరం పట్టుబడిన బియ్యం, లారీని జీసీసీ గోడౌన్‌కు తరలించి పట్టుబడిన బియ్యంను గోడౌన్‌లో భద్రపరిచారు.

# యూత్ ఫర్ సేవా సేవలు అభినందనీయం

తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి కే రవీందర్ గౌడ్

**బొంరస్ పేట మండలం, ఆగస్టు,22**

యూత్ ఫర్ సేవ సహకారంతో చెట్టుపల్లి తండా యందు కేజీబీవీలో విద్యార్థినులకు తాగునీటి సౌకర్యార్థం ఆర్వో ప్లాంటును ఏర్పాటుచేసి శనివారం ప్రారంభించడం జరిగింది ఈ సందర్భంగా తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి కే రవీందర్ గౌడ్ మాట్లాడుతూ,, గ్రామీణ ప్రాంతంలో చదువుతున్న విద్యార్థులకు మంచినీరు అందించినందుకు గాను యూత్ ఫర్ సేవా సభ్యులు సతీష్ రంగంపేట మరియు పుండరీకాక్ష అదే విధంగా సర్వీస్ ఫోర్స్ ప్రతినిధులు సంతోష్ రెడ్డి జైపాల్ మరియు ఆదిల్ గౌతములకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈరోజు 330 మంది విద్యార్థులు హాస్టల్ లో ఉండి చదువుతున్న విద్యార్థులకు ఎస్ ఓ రాధికా మేడం కోరిక మేరకు ఈ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు 330 మందికి ఆంగ్ల డిక్షనరీలను మరియు 55 మందికి మంచినీటి స్టీల్ బాటిల్స్ అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థినులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి హరీష్ రావు ను మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు

- **భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు.**
- **పినపాక నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ నేతలు.**

**మణుగూరు.ఆగస్టు 22 (డి డి 9వార్త)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, పినపాక నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు శనివారం నాడు హైదరాబాద్ కోకాపేట లో బిఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రివర్యులు,సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ను వారి స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. వారితో పాటు బిఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యులు దిండిగాల రాజేందర్, మరియు పినపాక నియోజకవర్గానికి చెందిన నేతలు,అశ్వాపురం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోడి అమరేందర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి,మిట్టకంటి సురేందర్ రెడ్డి, పినపాక మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి తదితరులు కలవడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,రేగా కాంతారావు పై అసత్య ఆరోపణలతో బద్నాం చేయాలని చూసిన వ్యక్తులకు గౌరవ తెలంగాణ హైకోర్టు తీర్పు చెంప పెట్టులా ఉందని, నీతి నిజాయితీకి,మచ్చలేని వ్యక్తిత్వానికి మారు పేరైన మంచి మనిషి రేగా కాంతారావు అని పేర్కొంటూ.. వారికి అభినందనలను తెలియజేశారు.

# భూసమస్యల పైన అవగాహన సదస్సు

- **ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్న వారు**
- **డాక్టర్ వాసం ఆనంద్ కుమార్ LLB. LLM PhD**

**తాడ్వాయి డిడి9 వార్త**

ఆగస్టు 23వ తారీకు ఆదివారం కామారం లోని సమ్మక్క సారలమ్మ ఆర్కియాలజీ రీసర్చ్ సెంటర్ నందు ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో భూమిపై హక్కులు ఆదివాసులకు ఏవిధంగా ఉన్నాయి ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు ఏ విధంగా సమస్య పరిష్కారం చేయగలము పూర్తిగా అవగాహన చేయడం కోసం ఆనంద్ కుమార్ రావడం జరుగుతుంది ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూభారతి చట్టం పైన పూర్తి అవగాహన కలిగి దానిపైన వర్క్ చేసిన వ్యక్తిగా మన ముందుకు తీసుకువచ్చి ఏజెన్సీ ప్రాంతంలో భూ సమస్యలు 1/70 యాక్టు ఎల్ టి ఆర్ ఏవిధంగా పనిచేస్తాయి అని పూర్తి అవగాహన చేయడం కోసం మనం ముందుకు రావడం జరుగుతుంది ఏజెన్సీ ప్రాంతంలోని షెడ్యూల్ గ్రామాలలో ప్రస్తుత భూసమస్య తీవ్రంగా ఉన్నందున ఆదివాసులకి పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవడంతో అధికారులు గిరిజనేతరులు ప్రభుత్వ భూములను కబ్జాలు చేయడం జరుగుతుంది మనకు చట్టాల పైన అవగాహన లేకనే ఇట్లాంటి సంఘటనలు జరుగుతున్నాయి కావున తాడ్వాయి మండలం. ఏటూరు నాగారం.వెంకటాపురం. వాజేడు. కన్నాయిగూడెం. మంగపేట. గోవిందరావుపేట. ములుగు. మండలాల లో ఉన్న ఆదివాసి పెద్దలు మరియు యూత్ అందరు కూడా వచ్చి చట్టాలపై పూర్తి అవగాహన చేసుకోగలరని కోరడం జరుగుతుంది




# జీవో నెంబర్ 97 రద్దు చేయాలి

- **విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలి.**
- **విద్యార్థులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోము..**
- **మండల బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం.**

**మణుగూరు.ఆగస్టు 22(డి డి 9వార్త)**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా BRS పార్టీ అధ్యక్షులు, పినపాక మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు ఆదేశాల మేరకు శనివారం నాడు మణుగూరు మండల BRS పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు బోశెట్టి రవి ప్రసాద్ ఆధ్వర్యంలో జీవో నెంబర్ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మణుగూరు పట్టణంలో భారీ ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొని ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా తమ నిరసనను వ్యక్తం చేశారు. జీవో నెంబర్ 97 కారణంగా విద్యార్థుల విద్యా భవిష్యత్తు, ఉన్నత విద్యా అవకాశాలు, ఉపాధి అవకాశాలపై ప్రభావం పడే పరిస్థితి ఉందని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దనీ, చదువుకునే యువత జీవితాలను అయోమయంలోకి నెట్టొద్దు అని, విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, జీవో నెంబర్ 97ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కులు, భవిష్యత్తు కోసం బీఆర్ఎస్ పార్టీ ఎప్పటికీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. జీవో నెంబర్ 97 రద్దు చేసే వరకు విద్యార్థుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన నాయకులు పద్దం శ్రీనివాస్, అశ్వాపురం యువజన అధ్యక్షులు గద్దల రామకృష్ణ, కరకగూడెం యువజన అధ్యక్షులు గుడ్ల రంజిత్, మణుగూరు మండల యువజన నాయకులు జక్కం రంజిత్, ఆవుల శ్రీను, బోయిల్ల రాజు, దేగల సంపత్, గాజుల కార్తీక్ తదితర యువజన నాయకులు పాల్గొనడం జరిగింది. విద్యార్థుల భవిష్యత్తు కోసం పోరాటం కొనసాగుతుందని ఈ సందర్భంగా వారు తెలియ చేశారు.

# 24న మణుగూరు రానున్న BRS జిల్లా అధ్యక్షులు, రేగా కాంతారావు..

- **ఏడూళ్ల బయ్యారం క్రాస్ రోడ్డు నుండి మణుగూరు CHP వరకు బైక్ ర్యాలీ..**
- **కళ్యాణ లక్ష్మి, షాదీ ముభారక్ పథకాలను కొనసాగించాలని నిరసన ర్యాలీలో పాల్గొననున్న రేగా..**

**మణుగూరు.ఆగస్టు 22 (డి డి 9వార్త)**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు 24.08.2026(సోమవారం) రోజున BRS పార్టీ జిల్లా అధ్యక్షులు పినపాక మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు మణుగూరు రానున్నారని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేయడం జరిగింది.ముందుగా మధ్యాహ్నం 12:00 గంటలకు ఏడూళ్ల బయ్యారం క్రాస్ రోడ్డు నుండి మణుగూరు CHP వరకు బైక్ ర్యాలీలో పాల్గొంటారని, మణుగూరు CHP వద్దకు చేరుకున్న తరువాత అక్కడనుండి నాయకులు, కార్యకర్తలతో కలిసి కిన్నెర కళ్యాణ మండపం వరకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముభారక్ పథకాలను కొనసాగించాలని నిరసన ర్యాలీలో పాల్గొంటారు. అనంతరం మణుగూరులోని కిన్నెర కళ్యాణ మండపంలో జరిగే పినపాక నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. కావున అన్ని మండలాల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, మాజీ ఎంపీపీలు, జడ్పిటిసిలు, PACS అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు, మాజీ సర్పంచులు, వార్డు మెంబర్లు, మహిళ నాయకులు, ఉద్యమకారులు, SC,ST, BC, మైనార్టీ అనుబంధ సంఘాల నాయకులు, సోషల్ మీడియా వారియర్లు, కార్యకర్తలు అభిమానులు 24వ తేదీన తప్పక హాజరై ఈ కార్యక్రమాలను విజయవంతం చేయవలసిందిగా కోరుతూ జిల్లా కార్యాలయం ప్రకటనలో తెలియ జేసింది.

# షైన్ హైస్కూల్ పై నాటి ఆరోపణలు అవాస్తవం



- **పాఠశాల నుంచి వెళ్లిన మాజీ సిబ్బంది స్పష్టీకరణ**
- **అపార్థంతోనే ఆరోపణలు వచ్చాయని వెల్లడి**

**బోనకల్,ఆగస్టు 22, (డీడీ9 వార్త):**

మండల పరిధిలోని రావినూతల గ్రామంలోని షైన్ హైస్కూల్, కరస్పాండెంట్‌పై గతంలో వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని, పాఠశాలలో గతంలో పనిచేసి వెళ్లిన ఉపాధ్యాయులు పుచ్చకాయల నాగమల్లేశ్వరి, పుచ్చకాయల తిరుపతమ్మ స్పష్టం చేశారు. శనివారం పాఠశాల ప్రిన్సిపల్ ఐటిపాముల శ్వేతను కలిసి తమ వివరణను లిఖిత పూర్వకంగా వెల్లడించారు. కరస్పాండెంట్ మహిళల పట్ల దురుసుగా ప్రవర్తించారన్న వార్తలు వాస్తవం కాదని , తమ మొబైల్ ఫోన్లను అనుమతి లేకుండా తనిఖీ చేశారన్న ఆరోపణలలో కూడా నిజం లేదన్నారు.అదే విధంగా పాఠశాల యాజమాన్యం తమను మానసికంగా వేధించినట్లు చేసిన ఆరోపణలలో కూడా వాస్తవం లేదన్నారు..తాము పాఠశాలను వీడటానికి ప్రధాన కారణం యాజమాన్యంతో ఏర్పడిన కొద్దిపాటి మనస్పర్ధలు మాత్రమేనని , మాకు ఇబ్బంధికారం అయిన ఏ ఇతర కారణాలు లేవని వారు పేర్కొన్నారు. తమకు రావాల్సిన జీతాల చెల్లింపుల విషయంలో మాత్రమే నాడు మండల విద్యాశాఖ అధికారికి వినతిపత్రం సమర్పించామని తెలిపారు. అయితే దాన్ని ఆసరాగా చేసుకుని పూర్వ యాజమాన్యం(యరమల సంజీవరెడ్డి)పాఠశాలపై, ప్రస్తుత కరస్పాండెంట్‌పై పలు ఆరోపణలు చేస్తూ వార్తలు ప్రచారం చేయించారని వారు పేర్కొన్నారు.అక్కడ పనిచేస్తున్న మమల్ని వారు ప్రభావితం చేసి, విషయాలను తప్పుగా అర్థం చేసుకునేలా చేసి,తమను పావులుగా ఉపయోగించుకున్నట్లు వారు ఆరోపించారు.గతంలో జరిగిన పరిణామాలపై పూర్తి వాస్తవాలను తెలుసుకోకుండా పాఠశాల యాజమాన్యంపై ఆరోపణలు చేయడం సరైనది కాదని వారు పేర్కొన్నారు.తమ వల్ల పాఠశాల యాజమాన్యానికి,కరస్పాండెంట్‌కు కలిగిన ఇబ్బందులకు విచారం వ్యక్తం చేశారు,

ఇకపై ఎటువంటి ఆరోపణలలో అయిన నిజానిజాలను విచారించి, అపోహలకు అవస్తవాలకు తావు ఇవ్వకుండా, విద్యార్థుల ఉన్నత స్థితికి సహకరించాలని కోరారు.

# ఘనంగా శ్రీ విజయదుర్గా అమ్మవారి ఆలయ అష్టమ వార్షికోత్సవాలు

- **సింగరేణి ఉద్యోగుల రక్షణతో పాటు సంస్థ సుభిక్షంగా కొనసాగాలని..**
- **అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఏరియా టి.బి.జి.కె.యస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి.**

**మణుగూరు.ఆగస్టు 22 (డి డి 9వార్త )**

లోక కళ్యాణార్థం, సింగరేణి ఉద్యోగుల రక్షణార్థం, మణుగూరు ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ సుభిక్షంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ మణుగూరు ఓపెన్ కాస్ట్‌లో కొలువుదీరిన శ్రీ విజయదుర్గా (మైసమ్మ) అమ్మవారి ఆలయంలో అష్టమ వార్షికోత్సవ వేడుకలను ఆలయ కమిటీ సభ్యులు మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా, అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.

వార్షికోత్సవ చివరి రోజు వేడుకల్లో భాగంగా శనివారం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గని ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి ఏరియా టి.బి.జి.కె.ఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు,నాయకులు హాజరయ్యారు. అమ్మవారిని వారంతా దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు నాగెల్లి వెంకటేశ్వర్లుతో పాటు నాయకులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాగెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కుల మతాలకు అతీతంగా గనిలో పనిచేస్తున్న అధికారులు, కార్మికులు ఐక్యంగా ఒక కుటుంబంలా ఏర్పడి ప్రతి ఏటా అమ్మవారి ఉత్సవాలను అత్యంత శోభాయమానంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు. ప్రకృతికి విరుద్ధమైన పరిస్థితుల్లో, ఎన్నో సవాళ్ల మధ్య విధులు నిర్వహిస్తున్న సింగరేణి కార్మికులు, ఉద్యోగులు మరియు వారి కుటుంబాలు సంతోషంగా, ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు కార్మికుల మధ్య ఒకరిపై ఒకరికి స్నేహభావాన్ని, ఆత్మీయతను మరింత పెంపొందిస్తాయని తెలిపారు. అధికారులు, కార్మికులు కలిసి ఇలాంటి ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల సంస్థలో ఐక్యత, పరస్పర సహకారం, సోదరభావం మరింత బలపడతాయని, ఇది సంస్థ ప్రగతికి ఎంతగానో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. కార్మికులు



ఒకే కుటుంబంలా కలిసిమెలిసి పనిచేసే వాతావరణం ఏర్పడితే సంస్థ అభివృద్ధితో పాటు సింగరేణి సంస్థకు ఉన్న గౌరవం, ప్రతిష్ట మరింత పెరుగుతుందని అన్నారు. ప్రతి ఏటా షడ్రుచులతో కూడిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించడం గనిలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల భక్తిభావానికి, సేవా స్ఫూర్తికి నిదర్శనమని తెలిపారు. అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు మానవతా విలువలను చాటిచెప్పడంతో పాటు కార్మిక కుటుంబాల మధ్య ఆత్మీయతను పెంపొందిస్తాయని అన్నారు. మూడు రోజుల పాటు వార్షికోత్సవ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో, క్రమబద్ధంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులను నాగెల్లి వెంకటేశ్వర్లు అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను మరింత ఘనంగా నిర్వహిస్తూ కార్మికుల ఐక్యతను, సంస్థ పట్ల వారి బాధ్యతా భావాన్ని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. శ్రీ విజయదుర్గా (మైసమ్మ) అమ్మవారి ఆశీస్సులతో మణుగూరు ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ నిరంతరం సుభిక్షంగా కొనసాగాలని త్వరితగతిన ప్రాజెక్ట్ అనుమతులు రావాలని సింగరేణి కార్మికులు, ఉద్యోగులు మరియు వారి కుటుంబాలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షిస్తూ అమ్మ వారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మునిగేల నాగేశ్వర రావు, మురళి కృష్ణ, పి కె నాగరాజు, దిశెట్టి రమేష్, మస్తాన్, సొసైటీ డైరెక్టర్ బీరయ్య, ఫిట్ సెక్రటరీ కటారి ప్రసాద్, శ్రీహరి, ఇమ్రాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# సురవరం సుధాకర్‌రెడ్డికి ఘన నివాళి

**ఎర్రజెండా పార్టీల ఐక్యతకు కృషి చేసిన మహానేత**

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 22 (డీడీ9 వార్త):**

సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ, కమ్యూనిస్టు మేధావి అమరజీవి కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా శనివారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో ఆయనకు ఘన నివాళులర్పించారు. నాయకులు సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అధ్యక్షుడు వాసిరెడ్డి



సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే ఉద్యమాల్లో పాల్గొని కమ్యూనిస్టు ఉద్యమాన్ని ముందుకు నడిపించిన గొప్ప నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అనేక భూపోరాటాలకు నాయకత్వం వహించి నిరుపేదలకు ఇంటి స్థలాల సాధనకు కృషి చేశారని తెలిపారు.తెలంగాణ నుంచి సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై దేశ కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రత్యేక గుర్తింపు పొందారని, నల్గొండ ఎంపీగా ప్రజా సమస్యలపై పోరాడటంతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలకు కృషి చేశారని పేర్కొన్నారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో జాతీయ ఉపాధి హామీ పథకం అమలులో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున సాగిన సమయంలో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉద్యమానికి మద్దతుగా నిలిచారని గుర్తుచేశారు. చివరి శ్వాస వరకు కమ్యూనిస్టు ఉద్యమానికి అంకితమై పనిచేశారని పేర్కొన్నారు. ఎర్రజెండా పార్టీలన్నీ ఐక్యంగా పనిచేయాలని కృషి చేసిన మహానేత సురవరం అని కొనియాడారు. ఆయన ఆశయాల స్ఫూర్తితో పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల మధ్య ఉంటూ పోరాడతామని నాయకులు తెలిపారు. సీపీఐ నగర కార్యదర్శి కనకరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ సూర్య, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

**పెద్దపల్లిలో పోస్టర్ ఆవిష్కరణ**

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 22 (డీడీ9 వార్త):**

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆగస్టు 24, 25 తేదీల్లో జార్జిరెడ్డి పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు నరేష్ రత్న పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో శిక్షణ తరగతుల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరేష్ రత్న మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత సమాజంలోని రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిణామాలను శాస్త్రీయ దృక్పథంతో అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, నిరుద్యోగం, విద్యారంగంలో ప్రైవేటీకరణ, ఫీజుల భారం, సామాజిక అసమానతలు తదితర




అంశాలపై అవగాహన పెంపొందించుకోవడానికి రాజకీయ శిక్షణ తరగతులు దోహదపడతాయని తెలిపారు. విద్యార్థి ఉద్యమాల చరిత్ర, ప్రజా ఉద్యమాల పాత్ర, దేశ రాజకీయ పరిస్థితులు, విద్యార్థుల హక్కులు, సామాజిక బాధ్యత తదితర అంశాలపై లోతైన చర్చలు, అధ్యయనం జరగాల్సిన అవసరం ఉందన్నారు. అ ధ్య య న ం – ఐ క్య త – పోరాట ం అ నే స్ఫూర్తితో విద్యార్థులు తమ హక్కుల కోసం ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని కోరారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగే ఈ కార్యక్రమానికి గద్వాల ప్రాంతం నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జార్జిరెడ్డి పీడీఎస్‌యూ సభ్యులు రమ్య, శిరీష, స్వప్న, వాసవి, కోమల, సౌజన్య, తిరుమల, సుకన్య, నవ్య, క్రాంతి, బేగం, సల్మా తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**తల్లిదండ్రులు, ఉపాధ్యాయులే మన శ్రేయోభిలాషులు**

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 22 (డీడీ9 వార్త):**

విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ చెడు అలవాట్లకు దూరంగా ఉంటే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని ఇంపాక్ట్ ట్రైనర్లు దేవి లక్ష్మీనర్సయ్య, మేజిక్ రాజా, వన్‌టౌన్ ఎస్ఐ మనోహర్ అన్నారు. గోదావరిఖని విద్యానగర్‌లోని సింగరేణి హైస్కూల్‌లో శనివారం 'సే నో టు డ్రగ్స్' కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..



తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఎల్లప్పుడూ విద్యార్థుల మంచి కోరే శ్రేయోభిలాషులని తెలిపారు. వారు చెప్పే మంచి మాటలను అర్థం చేసుకుని ఆచరించాలే తప్ప వారితో విభేదించకూడదని సూచించారు. మితిమీరిన సోషల్ మీడియా వినియోగం చదువుతో పాటు భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల జీవితాలు చిద్రమవుతాయని, విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ వాటికి అలవాటు పడకూడదని సూచించారు. మత్తు పదార్థాలను విక్రయించే, వినియోగించే వ్యక్తుల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఎస్ఐ మనోహర్ కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రూపా రెడ్డి హత్యకు నిరసనగా ఎస్ఎఫ్ఐ కొవ్వొత్తుల ర్యాలీ

- **ప్రైవేట్ టీచర్లకు భద్రత కల్పించాలి**
- **ఎస్ఎఫ్ఐ భద్రాచలం పట్టణ కార్యదర్శి కొప్పుల రవీందర్**




**భద్రాచలం , ఆగస్టు 22 డిడి9 వార్త**

నల్గొండ జిల్లాలో ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్ రూపా రెడ్డి దారుణ హత్యకు నిరసనగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీని ఎస్ఎఫ్ఐ భద్రాచలం పట్టణ కార్యదర్శి కొప్పుల రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ రూపా రెడ్డి హత్య ఘటన తీవ్రంగా కలచివేసిందని, ఆమెను విద్యార్థులే కత్తితో పొడిచి హత్య చేసినట్లు వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఘటనకు సంబంధించిన వాస్తవాలను పూర్తిగా వెలుగులోకి తీసుకురావడానికి సమగ్ర దర్యాప్తు చేపట్టి, బాధ్యులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది భద్రతపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని కోరారు. ప్రైవేట్ టీచర్లకు ప్రత్యేక భద్రతా చట్టం తీసుకురావడంతో పాటు విద్యాసంస్థల్లో రక్షణకు స్పష్టమైన నిబంధనలు రూపొందించాలని అన్నారు. ఉపాధ్యాయులపై బెదిరింపులు, దాడులు, వేధింపులు జరిగినప్పుడు తక్షణమే స్పందించేలా ప్రత్యేక ఫిర్యాదు వ్యవస్థ, హెల్ప్ లైన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు కూడా ఉపాధ్యాయులు, సిబ్బంది భద్రతకు బాధ్యత వహించేలా మార్గదర్శకాలు రూపొందించాలని కోరారు. ప్రతి పాఠశాలలో సైకాలజీ కౌన్సెలర్లను ఏర్పాటు చేసి విద్యార్థులకు మానసిక ఆరోగ్యం, భావోద్వేగ నియంత్రణ, మానవ సంబంధాలు, హింసకు దూరంగా ఉండటం వంటి అంశాలపై అవగాహన తరగతులు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# భావి తరాల భవిషత్ కోసం ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటడం అవసరం

**ఘనంగా షైన్ హై స్కూల్లో గ్రీన్ ప్లాంటేషన్ డే**



**బోనకల్,ఆగస్టు 22, డీడీ 9:**

స్థానిక షైన్ హైస్కూల్లో శనివారం నాడు గ్రీన్ ప్లాంటేషన్ డే ఘనంగా జరిపారు.ఈ కార్యక్రమాన్ని షైన్ హై స్కూల్ డైరెక్టర్ షేక్ లాల్ మహమ్మద్ ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు మొక్కలు నాటారు.. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ షేక్ అన్సర్ పాషా మాట్లాడుతూ మొక్కలను పెంచడం వల్ల భూమి మీద ఉన్న కాలుష్యాన్ని అరికట్టవచ్చని, అలాగే కలుషితం లేని స్వచ్ఛమైన గాలిని సొంతం చేసుకోవచ్చని అన్నారు. పాఠశాల డైరెక్టర్ షేక్ లాల్ మహమ్మద్ మాట్లాడుతూ పిల్లలందరూ కూడా వాతావరణాన్ని కాపాడుకోవాలని, వీలైనంత మొక్కలని నాటాలని భవిష్యత్తు తరాల వారికి ఈ మొక్కలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ షేక్ అన్సర్ పాషా,డైరెక్టర్ షేక్ లాల్ మహమ్మద్ ప్రిన్సిపాల్ అయిటి పాముల శ్వేత,అడ్మినిస్ట్రేటర్ దేగల వేలాద్రి ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

# సాలూర మండల బీజేపీ బీఎల్ఏలకు ఘన సన్మానం



**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 22(డీడీ9 వార్త) :**

భారతీయ జనతా పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంలో బూత్ లెవల్ ఏజెంట్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, వడ్డీ మోహన్ రెడ్డిలు పేర్కొన్నారు. శనివారం నిజామాబాద్ లో జరిగిన కార్యక్రమం లో బీజేపీ సాలూర మండల పార్టీ ఆధ్వర్యంలో బీఎల్ఏలను శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీకి బూత్ స్థాయి కార్యకర్తలే ప్రధాన బలమని కొనియాడారు. నిత్యం ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న బీఎల్ఏలను గౌరవించుకోవడం వల్ల వారిలో మరింత ఉత్సాహం, నూతన శక్తి కలుగుతాయన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి బూత్‌లోనూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు, బూత్ అధ్యక్షులు, బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఏఈపై బదిలీ వేటు..

## అదనపు ఏ.ఈగాఎండి హర్షద్. ఏఈడి ఉమా రావు..

**ఆగస్టు 22 డిడి9 వార్త వెంకటాపురం.**



విధుల్లో నిర్లక్ష్యం, రైతులు–విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించారనే ఫిర్యాదుల నేపథ్యంలో వెంకటాపురం విద్యుత్ శాఖ ఏఈ అజ్మేర హనుమాన్‌దాస్‌ను హనుమకొండ కార్పొరేట్ కార్యాలయానికి సరెండర్ చేస్తూ ములుగు ఎస్‌ఈ బిక్షపతి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వెంకటాపురం అదనపు బాధ్యతలను వాజేడు ఏఈ ఎండీ హర్షద్‌కు అప్పగించారు. ఇకపై మండలంలో విద్యుత్ సమస్యలు, పెండింగ్ పనులపై వినియోగదారులు నేరుగా వెంకటాపురం విద్యుత్ కార్యాలయాన్ని సంప్రదించాలని ఏఈడీ ఉమారావు సూచించారు. రైతులు, గృహ వినియోగదారుల సమస్యలను సకాలంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# అభిమానమే కాదు.. సేవలోను మెగాస్టార్ ఫ్యాన్స్ ముందంజ..

## ఘనంగా మెగాస్టార్ జన్మదిన వేడుక..

**ఆగస్టు22 డిడి9 వార్త వెంకటాపురం.**



వెంకటాపురం మండల కేంద్రంలో పద్మవిభూషణ్ మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను మెగా అభిమానులు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. సేవా కార్యక్రమాలతో వేడుకలకు శ్రీకారం చుట్టారు. ముందుగా స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. అనంతరం అభిమానుల ఆధ్వర్యంలో మస్తాన్ బిర్యానీ సెంటర్ నందు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి మెగాస్టార్ చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. చిరంజీవి సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని అభిమానులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెగా అభిమానులు, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కుసుంబాయి తండ మద్యరహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు తీర్మానం



**జనగామ ఆగష్టు 22(డిడి 9వార్త)బ్యూరో**

రఘునాథపల్లి మండలం పరిధిలోని కుసుంబాయి తండను మద్యరహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామపంచాయతీ పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. సర్పంచ్ కొర్ర స్వరూప రాజేందర్ నాయక్ అధ్యక్షతన శనివారం జరిగిన జనరల్‌బాడీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 25వ తేదీ తర్వాత గ్రామంలో బెల్ట్‌షాపులు, సారా, మద్యం, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తే రూ.10 వేల జరిమానా విధిస్తామని సర్పంచ్ తెలిపారు. గ్రామంలోని ఇతర సమస్యల పరిష్కారంపైనా సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అనిల్ కుమార్ ఉపసర్పంచ్ శంకర్ వార్డు సభ్యులు మరియు గ్రామ పెద్దలు మహిళలు యూత్ తదితరులు పాల్గొన్నారు.

# హలో ఆదివాసీ చలో ఉట్నూర్



**ఆదిలాబాద్: సొనాల డి డి 9 న్యూస్ పత్రిక ప్రకటన:-**

ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర కమిటీ ఏ హెచ్ పి ఎస్

పిలుపు మేరకు హలో ఆదివాసీ ఛలో ఉట్నూర్ ఐ టి డి ఏ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి!! తుడుందెబ్బ, గొండ్వాన పంచాయితీ రాయి సెంటర్స్, ఎ ఎస్ యు, ఎ ఎం ఎస్, ఎ ఆర్ ఎస్. ఎ వై ఎస్, ఎ ఈ డబ్లూ సి ఎ , ఎ కె ఎస్, ఆధార్ సొసైటీల ఆధ్వర్యంలో ఆగస్టు 24నా ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయండి డిమాండ్స్ చట్టబద్ధత లేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి దాని కోసం కమిషన్ నియమించాలి సుప్రీంకోర్టులో 1/70, చట్టాన్ని సవరించాలని,కేసు వేసిన గిరిజనేతరులపై చర్యలు తీసుకొని ఆదివాసీల పక్షాన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వామే పిటిషన్ వేయాలి. ఏజెన్సీ ప్రాంతంలో1/70,పెసా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి జీవో నెంబర్ 109 ప్రకారం ఏజెన్సీ ప్రాంతాల్లో పోలీస్ ఉద్యోగాలలో 75% రిజర్వేషన్ ఆదివాసులకు ఇవ్వాలి. జీవో ఎంఎస్ నెంబర్ 3,ను యధావిధిగా కొనసాగించాలి అటవీ భూములు సాగు చేస్తున్న ఆదివాసులకు రి సర్వే చేసి 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం హక్కు పత్రాలు జారీ చేయాలి ఆదివాసి నిరుద్యోగుల కోసం స్పెషల్ డిఎస్సి వేయాలి ఐటీడీఏ పరిధిలో ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి ఉద్యమబివందనాలతో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ సొనాల మండల కమిటీ అధ్యక్షులు జుగ్నక్ మారుతి ఉప అధ్యక్షులు రాయి సిడం జాకెస్ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేష్ మెస్రం భూమన్న సార్మేడి తొడసం లక్ష్మణ్ సోయం బాపూరావు గంగాధర్ ఆత్రం కిషన్ కోవా మెస్రం లాలురామ్ ఆత్రం శంకర్ మండల ఆదివాసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# సురవరం ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

## సీపీఐ పట్టణ కన్వీనర్ మారేడు శివాజీ

**భద్రాచలం, ఆగస్టు 22 (డిడి9 వార్త)**



మాజీ సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, రెండుసార్లు నల్లగొండ ఎంపీగా పనిచేసిన కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి ఆశయాల సాధన కోసం అందరూ పని చేయాలని సిపిఐ పట్టణ కన్వీనర్ మారేడు శివాజీ అన్నారు. సురవరం ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం భద్రాచలం సీపీఐ డివిజన్ కార్యాలయంలో పట్టణ సమితి ఆధ్వర్యంలో నివాళుల ర్పించారు. సీపీఐ సీనియర్ నాయకులు భాస్కర్ రావు సురవరం సుధాకర్ రెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా మారెడ్డి శివాజీ మాట్లాడుతూ పేదలు, కార్మికుల సమస్యలను పార్లమెంటులో బలంగా వినిపించి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన నాయకుడు సురవరం సుధాకర్ రెడ్డి అని అన్నారు. విద్యార్థి దశ నుంచే తెలంగాణ కోసం పలు పోరాటాలు నిర్వహించారని, యువజన ఉద్యమాల బలోపేతానికి కృషి చేశారని తెలిపారు. ఉత్తమ పార్లమెంటేరియన్ గా పలు అవార్డులు అందుకున్న ఆయన కమ్యూనిస్టు ఉద్యమానికి చేసిన సేవలు చిర స్మరణీయమని అన్నారు. ఆయన మరణం భారత ప్రజలకు, కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. సురవరం ఆశయాల సాధనకు పనిచేయటమే ఆయనకిచ్చే నిజమైన నివాళి అని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ నాయకులు ఎస్ వి ఎస్ నాయుడు, సాధనపల్లి సతీష్, కొక్కిరేణి అశోక్ కుమార్, చిట్టిపోతుల కృష్ణయ్య, కుమారి, శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# జీవో నెం 97 ని రద్దు చేయాలని బీఆర్ఎస్ శ్రేణుల నిరసన

**చర్ల,ఆగస్టు 22 (డిడి 9 వార్త )**



చర్ల మండల కేంద్రంలో శనివారం జీవో నెంబర్ 97 ని రద్దు చేయాలని జిల్లా అధ్యక్షులు రేగ కాంతారావు పిలుపు మేరకు నియోజకవర్గ ఇంచార్జి రావులపల్లి రాంప్రసాద్, మాజీ ఇంచార్జ్ మానె రామకృష్ణ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు నియోజకవర్గ యువజన నాయకులు కాకి అనిల్ సూచనలతో బీఆర్ఎస్ పార్టీ చర్ల మండల యువజన విభాగం అధ్యక్ష, కార్యదర్శులు అంబోజి సతీష్, కుప్పాల నిరంజన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించి, తాహసీల్దార్ కు వినతిపత్రం అందించారు. జీవో 97 వలన రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను, ఐటీఐలను, అప్రెంటిస్ శిక్షణా కేంద్రాలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి కొత్తగా ఏర్పాటు చేసిన శక్తి శాఖ కిందకు మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఈ నిర్ణయం వల్ల ఉన్నత విద్యా అవకాశాలు దెబ్బ తింటాయని,పాలిటెక్నిక్ పూర్తయ్యాక విద్యార్థులు ఈసెట్ పరీక్ష ద్వారా నేరుగా బీటెక్ రెండవ సంవత్సరంలో చేరే అవకాశం ఉందని, ఈ కొత్త విలీనం వల్ల ఆ లెటరల్ ఎంట్రీ విధానం రద్దవుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు. స్కిల్ యూనివర్సిటీ పబ్లిక్,ప్రైవేట్ భాగస్వామ్యంలో నడుస్తుందని దీనివల్ల ఫీజులు విపరీతంగా పెరిగే అవకాశం ఉందని, పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు అందకుండా పోతాయన్నారు. సాంకేతిక విద్యను అందించే పాలిటెక్నిక్ వ్యవస్థను లేబర్, స్కిల్లింగ్ పరిధిలోకి తీసుకురావడం వల్ల విద్యార్థులను కేవలం రెడీ-టు-మాన్‌పవర్ లేదా ఫ్యాక్టరీ కార్మికులుగా మార్చే ప్రమాదం ఏర్పడుతుందని, విద్యార్థులకు నష్టం కలిగించే ఈ జీవోను తక్షణమే రద్దు చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేనియెడల బిఆర్ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో విద్యార్థుల తరఫున పలు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్, ఆర్.కొత్తగూడెం సర్పంచ్ తుర్రం రవి, పాకలపాటి సత్యనారాయణ రాజు, బొజ్జ ప్రణయ్, పంజా రాజు,మామిడి రాజు ఎస్సీ సెల్ అధ్యక్షులు కొంబత్తిని రాంబాబు, ఉప సర్పంచ్ ఎడ్ల రామదాసు, బీసీ సెల్ అధ్యక్షులు గోరెంట్ల వెంకటేశ్వర్లు, తడికల చంద్రశేఖర్, యువజన నాయకులు సృజన్, ప్రేమ్, కృష్ణంరాజు, వంశీ , సాగర్, నితీష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద వికలాంగ మహిళలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

## బీఆర్ ఎస్ పార్టీ నాయకుడు ఇమంది నాగేశ్వరరావు

**భద్రాచలం , ఆగస్టు 22 (డిడి9 వార్త)**



భద్రాచలం పట్టణంలోని రాజుపేట కాలనీలో నివసిస్తున్న నిరుపేద వికలాంగ మహిళలకు ప్రభుత్వం వెంటనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని భద్రాచలం బీఆర్ ఎస్ పార్టీ నాయకుడు ఇమంది నాగేశ్వరరావు అధికారులను కోరారు. రాజుపేట కాలనీలో నివసిస్తున్న హసీనా పుట్టుకతోనే మూగ, చెవిటి కాగా, షాహిదా పుట్టుకతోనే మరుగుజ్జు వికలాంగురాలని ఆయన శనివారం కలిసారు. అత్యంత పేదరికంలో జీవిస్తున్న వీరికి సొంత ఇల్లు లేకపోవడంతో ప్రస్తుతం తెలిసిన వారి వద్ద ఆశ్రయం పొందుతూ జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు నిజమైన అర్హులైన నిరుపేదలు, వికలాంగులకు అందినప్పుడే వాటి ఉద్దేశ్యం నెరవేరుతుందని ఇమంది నాగేశ్వరరావు అన్నారు. హసీనా, షాహిదా పలుమార్లు అధికారులకు ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి ఫలితం లేకపోవడం బాధాకరమన్నారు. వారి దీనస్థితిని మానవతా దృక్పథంతో పరిశీలించి, అర్హతలను పరిగణనలోకి తీసుకుని వెంటనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఆయన అధికారులను విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థుల్లో పెరగాల్సిన శాస్త్రీయ ఆలోచనా ధోరణి

- రాజ్యాంగ పరిరక్షణతోనే దేశ పురోగతి : జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు నర్రా రామారావు
- మూఢనమ్మకాలు, అంధవిశ్వాసాలపై చైతన్య పోరాటం

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 22(డీడీ9 వార్త) :**



మన దేశాన్ని కాపాడుకోవడానికి ప్రతీ పౌరుడు మత, కుల, లింగ, ప్రాంతీయ భేదాలను విడనాడి ఐక్యంగా నిలబడాలని జన విజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నర్రా రామారావు పిలుపునిచ్చారు. బోధన్ మండలం అమ్దాపూర్ కేజీబీవీ పాఠశాల, బోధన్ పట్టణం ఆజాంగంజ్ పాఠశాల విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక, చైతన్య సోషల్ వెల్ఫేర్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రాజ్యాంగ మౌలిక నిర్మాణం, లౌకికవాదం, శాస్త్రీయ దృక్పథంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రామారావు మాట్లాడుతూ... సమాజంలో వేరూనుకున్న అంధవిశ్వాసాలు, మూఢనమ్మకాలు, చేతబళ్ళు, బాణామతి వంటి సామాజిక దురాచారాలను తుదిముట్టించి ప్రజల్లో చైతన్యాన్ని రగిలించడమే తమ సంస్థ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. విద్యార్థులు చిన్నతనం నుంచే ప్రతీ విషయాన్ని గుడ్డిగా అంగీకరించకుండా ప్రశ్నించే తత్వాన్ని, హేతుబద్ధమైన ఆలోచనా విధానాన్ని పెంపొందించుకోవాలని హితవు పలికారు. భారత రాజ్యాంగ విశిష్టతను వివరిస్తూ ప్రపంచంలోనే అత్యున్నతమైన మన రాజ్యాంగంలో 448 ఆర్టికల్స్, 12 షెడ్యూళ్ళు, 24 భాగాలు మరియు అద్భుతమైన ప్రవేశిక ఉన్నాయని రామారావు తెలిపారు. సార్వభౌమాధికారం, సోషలిజం, లౌకికవాదం, ప్రజాస్వామ్యం, గణతంత్ర వ్యవస్థ అనే ఐదు అంశాలు రాజ్యాంగానికి ప్రధాన మౌలిక స్తంభాలని పేర్కొన్నారు. రాజ్యాంగంలో లౌకికత్వానికి ప్రాధాన్యత ఉందని ప్రభుత్వానికి ఏ ఒక్క మతము ఉండదని, సర్వమత సమభావంతో అన్ని మతాలను సమానంగా చూడడమే లౌకికవాదమని తేల్చిచెప్పారు. ప్రస్తుత కాలంలో రాజ్యాంగ విలువలపై, లౌకికత్వంపై దాడులు పెరుగుతున్న తరుణంలో భావి భారత పౌరులైన విద్యార్థులకు రాజ్యాంగంపై అవగాహన కల్పించేందుకు జేవీవీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు దాదాపు 15,000 మంది విద్యార్థులకు చైతన్య సదస్సులు నిర్వహించామని వివరించారు. అనంతరం విద్యార్థులచే రాజ్యాంగ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం చైతన్య సోషల్ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ కోయేడి నర్సింహులు మాట్లాడుతూ... సమాజంలో దెయ్యాలు, భూతాలు, మంత్రా తంత్రాలు అనేవి కేవలం అపోహలు మాత్రమేనని, వాటిని ఎట్టిపరిస్థితుల్లోనూ నమ్మవద్దని ఉద్ఘాటించారు. ప్రతీ విషయాన్ని గుడ్డిగా ఆమోదించకుండా శాస్త్రీయ దృక్పథంతో ప్రశ్నించినప్పుడే నిజాలు వెలుగులోకి వస్తాయని చెప్పారు. ఇదే సమయంలో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ సూత్రాలను వివరిస్తూ, మూఢనమ్మకాలు నమ్మవద్దు.. కూల్‌డ్రింక్స్ వద్దు, మజ్జిగ, నిమ్మరసం ముద్దు అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్కర్ శ్రీనివాస్, కేజీబీవీ ఎస్ఓ హిమబిందు, ఆజాంగంజ్ పాఠశాల హెచ్ఎం చక్రధర్, ఉపాధ్యాయులు వనిత, సవిత, రవీందర్, శిరీషలతో పాటు అమ్దాపూర్ కేజీబీవీకి చెందిన 250 మంది విద్యార్థినులు, అజాంగంజ్ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# మల్లేష్ రెడ్డి కుటుంబానికి భరోసా

- ఎల్లవేళలా దేవర్ల రాకేష్ కుటుంబనికి అండగా ఉంటాం

**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో : (డిడి9 వార్త న్యూస్ )**

బజార్‌హత్నూర్ మండలం వర్తమాన్నూర్ గ్రామానికి చెందిన కిన్నర్ల మల్లేష్ రెడ్డి కొద్దీ రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతూ మృతి చెందడం జరిగింది ఈ విషయం చాలా బాధాకరం అని రక్షణ సేన బోథ్ ఇంచార్జ్ రాథోడ్ బాపూరావు అన్నారు . ఈ కష్టకాలంలో వారితో మృతి కారణమైన అంశాలని అడిగి తెలుసుకున్నట్టు మల్లేష్ చిత్ర పటానికి పూలు వేసి నివాళ్లు అర్పించారు దేవర్ల రాకేష్ కుటుంబానికి స్వయంగా వెళ్లి పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేయడం వారి కుటుంబానికి ఎంతో ధైర్యాన్ని అందించారు వారి కుటుంబనికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుంజలా భాస్కర్ రెడ్డి , అంకుష్ విట్టల్ , మోహన్ , మహేష్ , సంతోష్ , కుర్మె లక్ష్మణ్ , ఆనంద్ , , రమేష్ , శ్రీకాంత్ , రాజేందర్ మరియు గ్రామ పెద్దలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొని మల్లేష్ రెడ్డి కుటుంబానికి తమ అండగా ఉంటామని భరోసా ఇవ్వడం అభినందనీయం. మల్లేష్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాన్ని దేవుడు ఈ దుఃఖం నుండి కోలుకునేలా శక్తిని ప్రసాదించాలని కోరుకుంటున్నాము.

# బోధన్‌లో విధులకు ఆటంకం.. ఇద్దరి రిమాండ్

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 22(డీడీ9 వార్త) :**

బోధన్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా, అడ్డుకోబోయిన పోలీసులపై దాడికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల వివరాల ప్రకారం.. బోధన్ మండలంలోని కోప్పర్గా గ్రామానికి చెందిన రమొల్ల సాయిలు, బండారు వినయ్ అనే ఇద్దరు వ్యక్తులు శుక్రవారం రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో ఆసుపత్రికి వచ్చారు. అక్కడ విధుల్లో ఉన్న వైద్యునితో తీవ్రస్థాయిలో గొడవపడుతూ, ఆయన విధులు నిర్వహించకుండా అడ్డంకులు సృష్టించారు. ఆసుపత్రిలో వైద్యులకు, చికిత్స పొందుతున్న రోగులకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తున్నారనే సమాచారంతో రాత్రి బ్లూకోల్ట్స్ విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో రగడ సృష్టిస్తున్న ఆ ఇద్దరినీ సముదాయించి శాంతింపజేసేందుకు పోలీసులు తీవ్రంగా ప్రయత్నించారు. అయినప్పటికీ సాయిలు, వినయ్ తమ ప్రవర్తన మార్చుకోకుండా పోలీసులతోనూ గొడవకు దిగారు. దీంతో పరిస్తితి చేయిదాటకుండా ఉండేందుకు పోలీసులు వారిని స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నించగా, సదరు వ్యక్తులు పోలీసులపై దాడికి తెగబడ్డారు. ఈ అనుహ్య దాడిలో విధుల్లో ఉన్న ఒక కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. ప్రభుత్వ



వైద్యుడి విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా, పోలీసులపై దాడి చేసి గాయపరిచిన సదరు ఇద్దరు వ్యక్తులపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు. నిందితులను శనివారం న్యాయమూర్తి ఎదుట హాజరుపరచి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టాన్ని ఎవరైనా చేతుల్లోకి తీసుకున్నా, విధుల్లో ఉన్న ప్రభుత్వ సిబ్బంది, అధికారులపై దాడులకు పాల్పడినా చట్టపరంగా తీవ్ర పరిణామాలు ఉంటాయని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# లయన్స్ క్లబ్ ఉచిత కంటి శిబిరానికి విశేష స్పందన

**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 22(డీడీ9 వార్త) :**

గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా లయన్స్ క్లబ్ భీంగల్–వేముగల్లు ఆధ్వర్యంలో కుప్కల్ గ్రామంలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. సంపంగి నరేష్, సర్పంచ్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ శిబిరం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. లయన్స్ క్లబ్ సమాజ సేవలో ముందుండటం అభినందనీయమని



సర్పంచ్ కొనియాడారు. శిబిరంలో కంటి వైద్య నిపుణులు 68 మంది బాధితులకు కంటి పరీక్షలు చేయగా వారిలో 16 మందికి మోతిబిందు ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. క్యాటరాక్ట్ శస్త్రచికిత్సలు అవసరమైన రోగులందరినీ లయన్స్ క్లబ్ భీంగల్–వేముగల్లు తమ సొంత వ్యయంతో ఆర్మూర్ లయన్స్ కంటి ఆసుపత్రికి తీసుకు వెళ్లనుంది. అక్కడ నిపుణులైన వైద్యులతో ఉచితంగా ఆపరేషన్లు చేయించి, తిరిగి గ్రామానికి సురక్షితంగా చేరవేసే బాధ్యతను లయన్స్ క్లబ్‌యే స్వీకరించడం విశేషం. పేద ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు హనుమంతరావు, పడాల పురందర్, చైతన్య, హనుమాన్లు, బద్రి, సభ్యులు గోవర్ధన్, సాగర్, లింబాద్రి, మాజీ సర్పంచ్ భోజన్నతో పాటు స్థానిక నాయకులు, వార్డు సభ్యులు శేఖర్, స్వామి నాయక్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# డ్రగ్ మాఫియాపై నిజామాబాద్ పోలీసుల ఉక్కుపాదం

**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 22(డీడీ9 వార్త) :**

ఆల్ప్రాజోలం వంటి ప్రమాదకర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర డ్రగ్ నెట్‌వర్క్‌పై నిజామాబాద్ జిల్లా పోలీసులు చర్యలు చేపట్టారు. కేవలం నిందితులను అరెస్ట్ చేసి జైలుకు పంపడంతో సరిపెట్టకుండా వారు మత్తు పదార్థాల విక్రయం ద్వారా అక్రమంగా సంపాదించిన ఏకంగా రూ.5.15 కోట్ల విలువైన స్థిర, చర ఆస్తులను ఎన్డీపీఎస్ చట్టం కింద సీజ్ చేశారు. శనివారం జిల్లా పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీ పి.సాయి చైతన్య వెల్లడించిన వివరాల ప్రకారం... బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో నమోదైన ఎన్డీపీఎస్ కేసు క్రైమ్ నెం.148/2025 దర్యాప్తును సుదీర్ఘంగా నిర్వహించారు. ప్రారంభంలో ఐదుగురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.25 లక్షల విలువైన 2.5 కిలోల ఆల్ప్రాజోలం, శ్కోడా కారు, 8 మొబైల్ ఫోన్లు మరియు రూ.2.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు మూలాలను వెలికితీసేందుకు బోధన్ ఏసీపీ పి. శ్రీనివాస్ పర్యవేక్షణలో బోధన్ రూరల్ సీఐ డి.విజయ్ బాబు నేతృత్వంలో 15 మంది



అధికారుల ప్రత్యేక బృందం మహారాష్ట్రలో విస్తృతంగా పర్యటించింది. వారం రోజుల పాటు సాగిన సుదీర్ఘ శోధనలో, మహారాష్ట్రలోని సతారా పారిశ్రామిక ప్రాంతంలో సూర్య ప్రభ ఫార్మా కెమ్ పేరిట ఎరువుల తయారీ కోసం అనుమతులు పొంది, రహస్యంగా ఆల్ప్రాజోలం తయారు చేస్తున్న ఫ్యాక్టరీ గుట్టు రట్టయింది. అక్కడ జరిపిన దాడిలో సుమారు రూ.3 కోట్ల విలువైన 30 కిలోల ఆల్ప్రాజోలం, రూ.12 లక్షల నగదు, ఫోర్డ్ కారును స్వాధీనం చేసుకుని ఆ ఫ్యాక్టరీని సీజ్ చేశారు. అనంతరం డ్రగ్ స్మగ్లర్ల ఆర్థిక మూలాలను దెబ్బతీయడమే లక్ష్యంగా సుమారు సంవత్సరం పాటు పకడ్బందీ ఆర్థిక దర్యాప్తు జరిపారు. ముఖ్య నిందితులు అమర్‌సింగ్ A1, బసవరాజ్ A2, లక్ష్మణ్ గౌడ్ A5 మరియు వారి కుటుంబ సభ్యుల పేరిట మహారాష్ట్రలోని పూణే, సతారా, అహ్మద్‌నగర్ జిల్లాల్లో ఉన్న ఆస్తుల వివరాలను సేకరించారు. ఎన్డీపీఎస్ చట్టం సెక్షన్ 68F(2) కింద బొంబాయి, చెన్నై కాంపిటెంట్ అథారిటీల అనుమతులతో 9.06 ఎకరాల వ్యవసాయ భూమి, 1,370 చదరపు గజాల ఖాళీ స్థలాలు, కెమికల్ ఫ్యాక్టరీ, 4 నాలుగు చక్రాల వాహనాలు, 2 ద్విచక్ర వాహనాలు బ్యాంక్ ఖాతాల్లో ఉన్న రూ.27 లక్షల నగదును జప్తు చేశారు. దాదాపు 20 మందికి పైగా వ్యక్తుల మొబైల్ సమాచారాన్ని విశ్లేషించి సాంకేతిక ఆధారాలు సాధించిన సీఐ విజయ్ బాబు, ఆయన బృందాన్ని సీపీ సాయి చైతన్య ప్రత్యేకంగా అభినందించారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డ్రగ్స్ సమాచారాన్ని డయల్ 112 ద్వారా పోలీసులకు అందించాలని కోరారు.

# జాగిర్యాలలో ప్లాస్టిక్ రహిత సంకల్పం

**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 22(డీడీ9 వార్త) :**

గ్రామాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటమే ధ్యేయంగా భీమ్‌గల్ మండలం జాగిర్యాల గ్రామంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. శనివారం మహిళా భవనంలో గ్రామ సర్పంచ్ గడాల ప్రసాద్ అధ్యక్షతన పంచాయతీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. పర్యావరణానికి, మానవాళికి తీవ్ర హాని కలిగిస్తున్న ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని గ్రామంలో పూర్తిగా నిషేధించాలని ఈ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. సభలో పాల్గొన్న మహిళా సంఘాల సభ్యులు ప్లాస్టిక్ వాడకాన్ని బంద్ చేసేందుకు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ గడాల ప్రసాద్ మహిళలతో ప్లాస్టిక్‌ను ఇకపై ఎట్టిపరిస్థితుల్లోనూ వినియోగించబోమని ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్ స్థానంలో ప్రత్యామ్నాయ సంచులను వాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్



రాజేశ్వర్, సీసీ గంగ సాయిలు, రమేష్, రాజేశ్వర్, మహిళా సంఘాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# పేదల ఆత్మగౌరవానికి అద్దంపట్టేలా ఇందిరమ్మ ఇళ్లు

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 22(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ నగర పరిధిలోని నాగారంలో పేదల సొంతింటి కల నెరవేరింది. శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణతో కలిసి నాగారం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాన్ని ప్రారంభించారు. నాగారంలో 93 ప్లాట్లతో పాటు మొత్తం 268 అర్హులైన పేద కుటుంబాలకు ఇళ్ల పత్రాలను పారదర్శకంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గృహప్రవేశం చేసిన



పేదలకు మంత్రి స్వయంగా నూతన వస్త్రాలు అందించి పండుగ వాతావరణంలో అభినందనలు తెలిపారు. పేద ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లను అందిస్తామని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ... నగరంలో సొంత స్థలాలు లేక అద్దె ఇళ్లలోనే నివాసముంటున్న వేలాది నిరుపేద కుటుంబాలు ఉన్నాయని వివరించారు. వారికి శాశ్వత నివాసం కల్పించేందుకు హైదరాబాద్ మోడల్‌లో నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో మల్టీ–స్టోరీ 'ఇందిరమ్మ హౌసింగ్ టవర్స్' నిర్మించి ఇవ్వాలని ప్రతిపాదించారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై స్పందించిన మంత్రి పొంగులేటి, నగరంలో హౌసింగ్ టవర్ల నిర్మాణానికి అనువైన స్థలాలను పరిశీలించి సమగ్ర నివేదికను రూపొందించాలని కలెక్టర్, గృహ నిర్మాణ అధికారులకు వేదికపై నుంచే ఆదేశాలు జారీ చేశారు. అర్బన్ నియోజకవర్గంలో గృహ నిర్మాణ అవసరాలకు తొలి ప్రాధాన్యతనిస్తామని, లబ్ధిదారుల ఎంపికలో ఎక్కడా అవినీతికి చోటులేకుండా పారదర్శకత పాటిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, మున్సిపల్ కమిషనర్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# రాజీవ్‌నగర్ తండాలో టీబీ ఉచిత స్క్రీనింగ్ క్యాంప్



**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 22(డీడీ9 వార్త) :**

బోధన్ మండల పరిధిలోని పెగడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో రాజీవ్‌నగర్ తండాలో 'టీబీ ముక్త్ భారత్ అభియాన్ 2.0' కార్యక్రమంలో భాగంగా శనివారం ఉచిత టీబీ వైద్య శిబిరం నిర్వహించారు. అత్యాధునిక మొబైల్ హై–హెచ్ ఎక్స్‌రే వాహన సహాయంతో తండావాసులకు స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఈ శిబిరాన్ని బోధన్ డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విద్యా సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. టీబీ లక్షణాలు ఉన్నవారు, వ్యాధి సోకే ప్రమాదం ఎక్కువగా ఉన్న వ్యక్తులు ఉచితంగా కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి సకాలంలో వైద్యం పొందితే టీబీని పూర్తిగా నయం చేయవచ్చని సూచించారు. ఈ శిబిరంలో మొత్తం 76 మందికి ఛాతీ ఎక్స్‌రే ద్వారా టీబీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించగా, 46 మంది అనుమానితుల నుంచి నాట్ పరీక్ష కోసం కఫం నమూనాలను సేకరించారు. అలాగే మరో 72 మందికి హెచ్.ఐ.వి, సిఫిలిస్, రక్తంలో చక్కెర పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ, పీహెచ్‌ఎన్, ఎస్‌టీఎస్, ఎంపీహెచ్‌ఎస్, ఐసీటీసీ మొబైల్ వైద్య బృందం, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, తండా సర్పంచ్ లక్ష్మీబాయి, గ్రామ కార్యదర్శి ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# బోధన్‌లో 'పాంచజన్య సంకల్ప సభ' పోస్టర్ ఆవిష్కరణ



**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 22(డీడీ9 వార్త) :**

ఈ నెల 31న నిజామాబాద్ కలెక్టరేట్ మైదానంలో నిర్వహించనున్న పాంచజన్య సంకల్ప సభను జయప్రదం చేయాలని టీఆర్ఎస్ నేతలు పిలుపునిచ్చారు. శనివారం బోధన్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద పాంచజన్య సంకల్ప సభ, చలో నిజామాబాద్ ప్రచార పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో ఈ భారీ శంఖారావ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. సభను విజయవంతం చేసేందుకు బోధన్ నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

# ఆర్మూర్ నియోజకవర్గ సమస్యలపై మంత్రికి ఎమ్మెల్యే వినతి

**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 22(డీడీ9 వార్త) :**



ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి కోరారు. జిల్లా కలెక్టరేట్‌లో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలపై మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రక్రియలో లబ్ధిదారుల ఎంపిక సక్రమంగా జరగడం లేదని, ఇండ్ల నిర్మాణాలకు సంబంధించిన డబ్బులు సరిగ్గా అందక నిలిచిపోతున్నాయని చెప్పారు. కొత్త మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాల ఏర్పాటును వేగవంతం చేయాలని, ఆర్మూరులోని రెవెన్యూ ఆఫీసులన్నింటినీ సమీకృత కాంప్లెక్స్‌గా ఒకే చోట నెలకొల్పాలని మంత్రి పొంగులేటిని ఎమ్మెల్యే కోరారు.

# వ్యవసాయ విద్యతోనే అనుభవపూర్వక జ్ఞానం

**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 22(డీడీ9 వార్త) :**



చదువుతో పాటు క్షేత్రస్థాయి అనుభవం తోడైనప్పుడే విద్యార్థుల్లో వ్యవసాయం పట్ల పూర్తి అవగాహన, అనుభవ పూర్వక విద్య పెంపొందుతుందని కొనసముందర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బద్రి మధుపాల్ తెలిపారు. శనివారం పాఠశాల విద్యార్థులను వ్యవసాయ విద్యలో భాగంగా సమీపంలోని పంటల క్షేత్ర పర్యటనకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పంటల సాగులో ఆధునిక సేద్య పద్ధతులైన బిందు సేద్యం, డ్రిప్ పరికరాల భాగాలు, దాని వల్ల కలిగే ప్రయోజనాలు మరియు నీటి పొదుపు ఆవశ్యకత గురించి విద్యార్థులకు క్షేత్రస్థాయిలో వివరించారు. పంటల్లో కలుపు మొక్కల యాజమాన్యం, నివారణ చర్యలపై వ్యవసాయ ఉపాధ్యాయుడు సునుగూరు హరీష్ ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీడీ రమేష్ గౌడ్, ఉపాధ్యాయుడు భూమయ్య, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# బీర్కూర్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షునిగా అరిగే ధర్మతేజ

## సర్పంచుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాటం చేస్తాం



**బాన్సువాడ, ఆగస్టు 22(డిడి9 వార్త):**

బీర్కూర్ మండల సర్పంచుల ఫోరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల సర్పంచుల ఫోరం అధ్యక్షునిగా అరిగే ధర్మతేజ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా రేంజర్ల అనిల్, ప్రధాన కార్యదర్శిగా కవిత పండరిని ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు అరిగే ధర్మతేజ మాట్లాడుతూ.. మండలంలోని గ్రామాల అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం కోసం సర్పంచులంతా ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు, వీధి దీపాలు, డ్రైనేజీ తదితర ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా కృషి చేస్తామని ధర్మతేజ పేర్కొన్నారు.సర్పంచులకు ఎదురవుతున్న పరిపాలనా, నిధుల సమస్యలను కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆయాగ్రామాల సర్పంచులు, సుధరణి రాములు, శ్రీనివాస్, రమేష్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

# యోగాతోనే విద్యార్థుల్లో ఏకాగ్రత







**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 22(డీడీ9 వార్త) :**

విద్యార్థులు, యువత శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగాను నిత్యం సాధన చేయాలని యోగా మాస్టర్ మాధవి పిలుపునిచ్చారు. శనివారం బోధన్ పట్టణంలోని టీటీడీ కళ్యాణ మండపంలో పతాంజలి ధ్యాన యోగ విజ్ఞాన కేంద్రం, ఓం యోగశాల, ఆర్య సమాజ్ బోధన్ ఆధ్వర్యంలో 7వ జిల్లా స్థాయి యోగాసన పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 400 మంది క్రీడాకారులు పాల్గొని తమ యోగా నైపుణ్యాలను ప్రదర్శించారు. గెలుపొందిన విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు, ఈ సర్టిఫికెట్లు ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్‌కు ఉపయోపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖ్యాతం గంగాధర్, జిల్లా కార్యదర్శి బాలశేఖర్, రామచందర్, ప్రభాకర్, సంగీత, రామరెడ్డి, అశ్మంత్ కుమార్, భూలక్ష్మి రెడ్డి, బాలగంగాధర్, డాక్టర్ సునీల్, డాక్టర్ సుచేత తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పొంగులేటిని కలిసిన నిజామాబాద్ సీపీ సాయిచైతన్య



**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 22(డీడీ9 వార్త) :**

రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని కృష్ణ హోటల్‌లో శనివారం మంత్రిని కలిసిన సీపీ, ఆయనకు పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# వాటర్ షెడ్ ఆధ్వర్యంలో రైతులకు పైపులు స్పింక్లర్లు పంపిణీ

**అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం (డి డి 9 వార్త ) ఆగష్టు 22**

తలమడుగు మండలం జలి గ్రామపంచాయతీ పరిధిలో. తొక్కి గూడా షేర్ గూడ. పునాగుడా గ్రామాల రైతులకు. సుమారు 15 లక్షల విలువగల 46 మంది రైతులకు వ్యవసాయ సామాగ్రి. 30 పైపులు 7స్పింక్లర్ సెట్లు అందజేసినట్లు ఝరి గ్రామ సర్పంచ్ మెస్రం రూప తెలిపారు. ఈ యొక్క పంపిణీ కార్యక్రమం PMKSY (DRDA). సంస్థ వారి ఆధ్వర్యంలో 60 శాతం సబ్సిడీపై పంపిణీ చేసినట్లు తెలిపారు.అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ మేస్త్రం రూప మాట్లాడుతూ. మారుమూల గిరిజన గ్రామాలలో నిరుపేద రైతులకు వారి అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ యొక్క సంస్థ ద్వారా వ్యవసాయ సామాగ్రి అందజేయడం చాలా ఆనందకరమన్నారు. మరి రానున్న రోజులలో రైతులకు. టార్పాలిన్లు ఆయిల్ ఇంజన్లు. ఇతర వ్యవసాయ సామాగ్రి కూడా అర్హులైన రైతులకు. అందజేయడానికి సంస్థ సిద్ధంగా ఉందని. రైతులు ఈ యొక్క అవకాశాన్ని. సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో వాటర్ షెడ్ సంస్థ అధికారి మల్లేష్. పునగూడా సర్పంచ్ పేందూరు హనుమంతు నాయకులు మేస్రం కాశీరాం గిరిధర్ రైతులు చిత్రు నాగరావు గ్రామస్తులు మరియు యువకులు పాల్గొన్నారు.



# పారదర్శక ఓటరు జాబితా కోసం కృషి చేయాలి



**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 22(డీడీ9 వార్త) :**

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు పరిరక్షించబడేలా బిజెపి శ్రేణులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి అధ్యక్షతన నిజామాబాద్ జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఫేజ్–2 ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయిలో ఓటర్లకు పూర్తి అవగాహన కల్పించాలని, ఎలాంటి సందేహాలున్నా నివృత్తి చేయాలన్నారు. జాబితాలో తప్పులు అభ్యంతరాలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఆగస్టు 25న నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఎంపీ అర్వింద్ ప్రజల సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషిని, ప్రజాసేవను వివరించేలా పలు కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగా రెడ్డి, బోధన్ ఇన్ ఛార్జ్ వడ్డీ మోహన్ రెడ్డి, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నూతన సీఐ చంద్రశేఖర్ రెడ్డి గారికి BSP నాయకుల సన్మానం




**కొడంగల్ న్సిపల్,ఆగస్టు,22**

కొడంగల్ నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ) గా బాధ్యతలు స్వీకరించిన చంద్రశేఖర్ రెడ్డి గారికి బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కొడంగల్ నియోజకవర్గంలో శాంతి భద్రతలు పరిరక్షించడంలో, ప్రజలకు న్యాయం చేయడంలో మీ పాత్ర కీలకమని, పోలీసు శాఖకు BSP పార్టీ తరపున పూర్తి సహకారం ఉంటుందని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో కొడంగల్ అసెంబ్లీ ఇంచార్జ్ యు. రమేష్ బాబు, అసెంబ్లీ అధ్యక్షులు శ్రీనివాస్, అసెంబ్లీ కార్యదర్శి కేశవులు, అసెంబ్లీ ఉపాధ్యక్షులు ఎం. వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# పేదల కళ్లల్లో ఆనందమే ప్రజా ప్రభుత్వ విజయం





- నిజామాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన
- త్వరలోనే జిల్లాల్లో 'ఇందిరమ్మ టవర్లు': మంత్రి పొంగులేటి

**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 22(డీడీ9 వార్త) :**

పేదింటి చిరకాల స్వప్నాన్ని నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. నిజామాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా శనివారం ఉదయం ఆయన స్థానిక శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి కార్పొరేషన్ పరిధిలో మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న, ఇప్పటికే పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, లబ్ధిదారులతో నేరుగా ముచ్చటించి వారి మనోగతాన్ని తెలుసుకున్నారు. సొంతింటి కల నెరవేరిందనే తృప్తి లబ్ధిదారుల కళ్లల్లో కనిపించిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ప్రభుత్వానికి వారు తెలిపిన కృతజ్ఞతలు తమలో ఎంతో గర్వాన్ని నింపాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో తీసుకొస్తున్న మార్పును ప్రత్యక్షంగా చూడటం గొప్ప అనుభూతిని ఇచ్చిందన్నారు. పేదింటి కలను తీర్చే బాధ్యత తనకు దక్కడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. అనంతరం హైదరాబాద్ తరహాలో బహుళ అంతస్తులతో నిర్మించే 'ఇందిరమ్మ హౌసింగ్ టవర్స్'ను రాష్ట్రంలోని ఇతర ప్రధాన పట్టణాల్లోనూ నిర్మించేందుకు నిజామాబాద్ నగరం నుంచే శ్రీకారం చుట్టబోతున్నట్లు ప్రకటించారు. ఇందుకోసం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గృహనిర్మాణ శాఖకు చెందిన స్థలాలను అధికారులతో కలిసి పరిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో రెండు విడతలు, హైదరాబాద్‌లో మొదటి విడతతో కలిపి మొత్తం 8 లక్షల ఇళ్లు మంజూరు చేశామని, ఇందులో 2 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయి గృహప్రవేశాలు కూడా జరిగాయని చెప్పారు. గత ప్రభుత్వం అరకొరగా నిర్మించి వదిలేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నివాస యోగ్యంగా మార్చేందుకు అవసరమైన మౌలిక వసతులు వెంటనే పూర్తి చేయాలని, పారదర్శకంగా అర్హులను ఎంపిక చేసి ఇళ్లను అందజేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు.



# రెవెన్యూ, గృహ నిర్మాణ కార్యక్రమాలపై మంత్రి సమీక్ష

**నిజామాబాద్, ఆగస్టు 22**

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో శనివారం నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన రెవెన్యూ అంశాలు, గృహ నిర్మాణ కార్యక్రమాల ప్రగతిపై మంత్రి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ, హౌసింగ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే శాఖల అధికారులతో శాఖల వారీగా పురోగతిని సమీక్షించారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ కుమార్, స్పెషల్ సెక్రటరీ రాజీవ్ గాంధీ హనుమంతు, కామారెడ్డి జిల్లా కలెక్టర్లు భవేష్ మిశ్రా, ఆశిష్ సాంగ్వాన్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

The imprint line should be printed legibly as Printed by Published by BATHULA KUMARA RAJA on behalf of GARUDA, printes at and published at H.No 2-86/1 PLOT NO. 26-SP, SY NO 420 sager highway, ragannaguda village, abdullapur mandal RANGAREDDY , TELANGANA- 502518